
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
గుంటూరు జిల్లా వార్తలు
శుక్రవారం 15 మార్చి 2024



సమ్మతి.. అసమ్మతి

పల్నాడు జిల్లాలో అభ్యర్థుల ప్రకటనతో టీడీపీ శ్రేణుల్లో సమరోత్సాహం నెలకొంది. టీడీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అయితే అందుకు విరుద్ధంగా వైసీపీలో సమన్వయకర్తల పేరిట జరుగుతున్న తంతుతో అసమ్మతి రేగుతోంది. వైసీపీ అధినేత జగన్ వద్ద పంచాయతీ జరిగినా అసమ్మతి వర్గాలు శాంతించడంలేదు. పల్నాడు జిల్లాలో ఆరుగురు అభ్యర్థులను ప్రకటించగా, వైసీపీ అధికారికంగా ఒక్క అభ్యర్థిని కూడా ప్రకటించలేదు. చిలకలూరిపేట నియోజకవర్గంలో వైసీపీ ఇప్పటికే ఇద్దరు సమన్వయకర్తలను మార్చింది. ఇక్కడ వైసీపీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. కొత్తగా నియమితులైన గుంటూరు మేయర్ కావేటి మనోహర్‌నాయుడును సమన్వయకర్తగా నియమించడాన్ని వైసీపీ క్యాడర్ వ్యతిరేకిస్తోంది. ఇక నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లో కూడా వైసీపీలో అసమ్మతి తారాస్థాయికి చేరింది. ఈ రెండు నియోజకవర్గాలకు సంబంధించి సీఎం జగన్ చెప్పినా అసమ్మతి నేతలు మెట్టు దిగిరాలేదని తెలుస్తోంది.

ఉమ్మడిగా.. దూకుడు

- రెండో జాబితాలో నలుగురు పేర్లు
- సంబరాల్లో మునిగిన తెలుగు తమ్ముళ్లు
- పల్నాడులో నరసరావుపేట, బాపట్లలో చీరాల పెండింగ్
- అధికారికంగా అభ్యర్థులను ప్రకటించని వైసీపీ అధిష్ఠానం
- టీడీపీ తొలిజాబితాలో ప్రకటించిన అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే రాజకీయ వేడి రగులుతుండగా ఉమ్మడి అభ్యర్థుల ప్రకటనతో టీడీపీ దూకుడు పెంచుతోంది. ఇప్పటికే స్పష్టత వచ్చిన స్థానాల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. ఇక వైసీపీలో అధికారికంగా అభ్యర్థులు పేర్లు ప్రకటించలేదు. పైగా అసమ్మతితో పలు నియోజకవర్గాలు శ్రేణులు రగలిపోతున్నాయి. సమరోత్సాహంతో టీడీపీ శ్రేణులు దూసుకెళ్తోండగా, అభ్యర్థులపై అయోమయం, అసమ్మతితో ఫ్యాన్ పార్టీలో నిస్తేజం నెలకొంది. టీడీపీ, జనసేన అభ్యర్థులు ఖరారు కావడంతో ఆయా నియోజకవర్గాల్లో తెలుగు తమ్ముళ్లు, జనసైనికుల్లో సంబరాల్లో మునిగి తేలుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల లోక్‌సభ పరిధిలోకి వచ్చే మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి 20 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు టీడీపీ, జనసేన పార్టీల రెండు జాబితాలను విడుదల చేయగా అందులో 18 మంది అభ్యర్థులను ఖరారు చేశారు. గురువారం చంద్రబాబు ప్రకటించిన రెండో జాబితాలో పల్నాడు జిల్లాకు సంబంధించి పెదకూరపాడు, గురజాల, గుంటూరు జిల్లాకు చెందిన గుంటూరు తూర్పు, పశ్చిమ స్థానాలు ఉన్నాయి. ఆది నుంచి ఉత్కంఠ రేపుతున్న గుంటూరు నగర పరిధిలోని రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసే టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి అభ్యర్థులు ఎట్టకేలకు ఖరారయ్యారు. దీంతో గుంటూరు లోక్‌సభ పరిధిలోని అన్ని స్థానాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తి అయినట్లైంది. తాజాగా విడుదల చేసిన రెండో జాబితాలో గుంటూరు తూర్పు అభ్యర్థిగా ఎండీ నసీర్ అహ్మద్ పేరు ఖరారు చేశారు. ఇక పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి ఎంపిక విషయంలో కొద్ది రోజులుగా సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. వాస్తవానికి ఈ సీటు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కోవెలమూడి నానీకి ఇవ్వాల్సి ఉంది. అయితే ఊహించని విధంగా మంత్రి విడదల రజిని వైసీపీ అభ్యర్థిగా గుంటూరు పశ్చిమకు వలస రావడంతో నానీ అదృష్టం తారుమారైంది. రజినీది బీసీ సామాజికవర్గం కావడంతో అదే సామాజికవర్గం మహిళను బరిలోకి దించాలని టీడీపీ అధిష్ఠానం భావించింది. దీంతో బీసీ సామాజికవర్గానికి చెందిన పిడుగురాళ్ల మాధవి(రజక)ని అదృష్టం వరించింది. ఆమె భర్త, రియల్ ఎస్టేట్ వ్యాపారి గళ్లా రామచంద్రరావు(కమ్మ) కున్న ఆర్థిక అంగ బలాలు ఆమెకు కలిసొచ్చాయి. శ్రీ భ్రమర టౌన్ షిప్స్, వికాస్ హాస్పటల్స్ ఎండీగా కొనసాగుతున్న రామచంద్రరావుకు గుంటూరులో ఉన్న పరిచయాలు కూడా మాధవి అభ్యర్థిత్వం వైపు టీడీపీ అధిష్ఠానం మొగ్గుచూపేలా చేశాయి. గురజాల నియోజకవర్గాలకు పార్టీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు, పెదకూరపాడుకు బాష్యం ప్రవీణ్ పేర్లను ప్రకటించింది.

దూసుకెళ్తోన్న అభ్యర్థులు

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే 20 అసెంబ్లీ స్థానాలకు సంబంధించి తొలివిడతలో 14 మంది అభ్యర్థులను ఖరారు చేశారు. వారి పేర్లను చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు గతంలోనే ప్రకటించారు. దీంతో ఆయా అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తోన్నారు. మంగళగిరి నుంచి నారా లోకేశ్ పేరు తొలి జాబితాలోనే ప్రకటించగా ఆయన ఇప్పటికే విజయపథం వైపు దూసుకుపోతున్నారు. పొన్నూరు నుంచి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ వరుసగా ఏడో పర్యాయం ఎన్నికల బరిలోకి దిగి ఎన్నికల శంఖారావం పూరించారు. ఇప్పటి వరకు ఐదు విజయాలను చవిచూసిన నరేంద్ర ఆరో పర్యాయం కూడా గెలిచి చట్టసభలోకి అడుగుపెట్టాలనే సంకల్పంతో ఎన్నికల యుద్ధానికి సన్నద్ధమయ్యారు. ఎస్సీ నియోజకవర్గాలైన తాడికొండ, ప్రత్తిపాడు నుంచి టీ శ్రావణ్‌కుమార్, బీ రామాంజనేయులు బరిలోకి దిగి ప్రచార పర్వంలో మునిగిపోయారు. తొలి జాబితాలోనే బాపట్ల లోక్‌సభ పరిధిలోకి వచ్చే ఐదు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి పోటీలో ఉండే అభ్యర్థులను టీడీపీ ప్రకటించగా ఆయా అభ్యర్థులు ప్రచార పర్వంలో ఉన్నారు. పర్చూరు నుంచి ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయంపై కన్నేశారు. రేపల్లె నుంచి అనగాని సత్యప్రసాద్, అద్దంకిలో గొట్టిపాటి రవికుమార్, వేమూరు నుంచి నక్కా ఆనంద్‌బాబు, బాపట్ల నుంచి తొలిసారి వేగేశన నరేంద్రవర్మ ఇంటింటి ప్రచారంలో అభ్యర్థులు దూసుకుపోతున్నారు. పల్నాడు జిల్లాకు సంబంధించి సీనియర్ నేతలకు టీడీపీ అధిష్ఠానం అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యం ఇచ్చింది. వినుకొండకు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, చిలకలూరిపేట ప్రత్తిపాటి పుల్లారావు, సత్తెనపల్లి కన్నా లక్ష్మీనారాయణ, మాచర్ల జూలకంటి బ్రహ్మారెడ్డిల పేర్లు తొలిజాబితాలోనే అధిష్ఠానం ఖరారు చేసిన విషయం తెలిసిందే. వారు ప్రచారంలో నేరుగా ఓటర్లను కలుస్తున్నారు.

నరసరావుపేట, చీరాలపై ఉత్కంఠ

బాపట్ల జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఒక్క చీరాల మాత్రమే పెండింగ్‌లో ఉంది. గురువారం విడుదల చేసిన రెండోజాబితాలో చీరాలతో పాటు పల్నాడు జిల్లా నరసరావుపేటకు చోటు దక్కలేదు. దీంతో ఈ రెండు సీట్ల విషయంలో టీడీపీ శ్రేణుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. నరసరావుపేట అభ్యర్థి విషయంలో టీడీపీ అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోంది. నియోజకవర్గ ఇన్ చార్జి డాక్టర్ చదల వాడ అరవిందబాబు పేరుతో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించింది. అయినా అభ్యర్థి విషయంలో అధిష్ఠానం ఇంకా నిర్ణయం తీసుకోలేదు.


నారా లోకేశ్, మంగళగిరి


నసీర్ అహ్మద్, గుంటూరు-1


పి.మాధవి, గుంటూరు-2


టి.శ్రావణ్‌కుమార్, తాడికొండ


డి.నరేంద్రకుమార్, పొన్నూరు


ఎన్.మనోహర్, తెనాలి


రామాంజనేయులు, ప్రత్తిపాడు

తొలిసారి.. భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు టీడీపీ అభ్యర్థిగా తుళ్లూరు మండలం పెద పరిమి గ్రామానికి చెందిన భాష్యం ప్రవీణ్ బరిలోకి దిగనున్నారు. వ్యవసాయ కుటుంబం నేపథ్యం కలిగిన లావణ్య, వెంకటరావుల ప్రథమ సంతానం ప్రవీణ్. టీడీపీలో క్రియాశీలకంగా ఉండే ప్రవీణ్‌కు తొలిసారిగా సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని చంద్రబాబు కల్పించారు. తన పేరును అధిష్ఠానం ప్రకటించగానే ప్రవీణ్ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను కలసి సహాయ సహకారాలను కోరారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి ప్రవీణ్‌కు మద్దతు తెలియజేసి ఆయన్ను సత్కరించి అభినందనలు తెలిపారు. కొంతకాలంగా టిక్కెట్ వస్తుందని భావించిన భాష్యం ప్రవీణ్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని క్యాడర్‌ను పరిచయం చేసుకున్నారు. తొలుత ప్రవీణ్ చిలకలూరిపేట నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ పెదకూరపాడుకు అయనను అధిష్ఠానం పంపింది.

ఏడో సారి యరపతినేని

గురజాల నుంచి యరపతినేని శ్రీనివాసరావు ఏడో సారి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగనున్నారు. యరపతినేని 1994లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999, 2004 ఎన్నికల్లో ఓటమి పాలవగా 2009, 2014 ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల్లో ఓటమిని చవిచూశారు. దాచేపల్లిలో ఇటీవల అధినేత చంద్రబాబు సభను విజయవంతం చేసి సత్తా చాటారు. దీంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ అయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు.

రెండో సారి నసీర్

మొహమ్మద్ నసీర్ గుంటూరు తూర్పు నుంచి రెండో సారి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారు. 2019లో పోటీ చేసిన ఆయన స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అయినా పార్టీ పటిష్ఠతే ధ్యేయంగా నియోజకవర్గంలో పనిచేశారు. పార్టీ కార్యకలాపాలతోపాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేశారు. నియోజకవర్గ పరిధిలో అనేక రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య సహాయం అందజేశారు. ఇక్కడి నుంచి తొలుత కొత్త అభ్యర్థిని దించాలని భావించినప్పటికీ నసీర్ కంటే మెరుగైన అభ్యర్థి దొరకలేదు. దీంతో ఆయన అభ్యర్థిత్వానికే పార్టీ అధినేత చంద్రబాబు ఆమోదం తెలిపారు. గత ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ఈ ఐదేళ్లపాటు కష్టకాలంలో పార్టీకి అండగా నిలవటం నసీర్‌కు ప్లస్ పాయింట్ అయింది.

సేవారంగం నుంచి రాజకీయాల్లోకి మాధవి

పొన్నూరు నియోజకవర్గంలోని ములుకుదురుకు చెందిన పిడుగురాళ్ల మాధవి బీసీ సామాజికవర్గానికి చెందిన విద్యావంతుల కుటుంబం నుంచి వచ్చారు. ఎంసీఏ పూర్తి చేసి సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమయ్యారు. అనంతరం కొంతకాలం బోధనా వృత్తిలో కొనసాగారు. ఆమె తండ్రి కేంద్ర ప్రభుత్వ సర్వీసులో పనిచేశారు. ఆయన స్ఫూర్తితో మాధవికి ప్రజాసేవపై ఆసక్తిగా వుండేది. శ్రీభ్రమరలో చారిటీ ట్రస్టును స్థాపించి పలు సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.


యరపతినేని శ్రీనివాసరావు గురజాల


జీవీ ఆంజనేయులు వినుకొండ


ప్రత్తిపాటి పుల్లారావు చిలకలూరిపేట


కన్నా లక్ష్మీనారాయణ సత్తెనపల్లి


జూలకంటి బ్రహ్మారెడ్డి మాచర్ల


భాష్యం ప్రవీణ్, పెదకూరపాడు


అనగాని సత్యప్రసాద్(రేపల్లె), వేగేశన నరేంద్రవర్మ(బాపట్ల), ఏలూరి సాంబశివరావు (పర్చూరు), గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి), నక్కా ఆనందబాబు (వేమూరు)

టీడీపీలోకి.. జంగా?

- రెండు దఫాలుగా ఎంపీ లావుతో చర్చలు
- గుంటూరు, నరసరావుపేటల్లో వరుస భేటీలు



నరసరావుపేట, మార్చి 14: పల్నాడులో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైందన్న ప్రచారం జరుగుతోంది. నరసరావుపేట లోక్‌సభ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ఎమ్మెల్సీ జంగాతో జరిపిన చర్చలే ఇందుకు నిదర్శనమని పలువురు భావిస్తున్నారు. గుంటూరులోని ఎంపీ కార్యాలయంలో గురువారం ఉదయం, నరసరావుపేటలోని ఎంపీ కార్యాలయంలో సాయంత్రం రెండు దఫాలుగా లావు, జంగా భేటీ అయ్యారు. జంగా టీడీపీలో చేరికపై ఇద్దరి మధ్య చర్చలు జరిగినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. రెండు రోజుల్లో జంగా టీడీపీలో చేరతారన్న ప్రచారం ఊపందుకుంది. ప్రభుత్వ విప్ పదవి నుంచి వైసీపీ అధిష్ఠానం జంగాను తొలగించిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ పదవి విషయంలోనూ కృష్ణమూర్తికి పొమ్మనకుండా పొగపెడుతున్నట్లు సమాచారం. వైసీపీని వీడాల్సిన పరిస్థితులను అధిష్ఠానం కల్పిస్తోందని జంగా అనుచరులు అంటున్నారు. తన అనుచరులతో చర్చించి టీడీపీలో చేరే అంశంపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నట్లు జంగా తెలిపారు. ఎంపీ తనతో చర్చించిన మాట వాస్తవమేనని, టీడీపీలో చేరాలని ఎంపీ తనను కోరినట్లు చెప్పారు.

లోపలి పేజీలో...



మెరిసిన పసుపు ధర

- క్వింటాల్ ధర రూ.15 వేలకు పైగా అమ్మకం
- 847 బస్తాల పసుపు విక్రయం

అమరావతిపై ఆగని విచ్ఛిన్నం..

- ఇప్పటికే రాష్ట్రాన్ని అధోగతి పట్టించిన జగన్‌రెడ్డి
- 1549వ రోజుకు రైతుల ఆందోళనలు

రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకునేందుకు కలసిరండి.. కదలిరండి..!

ఎన్నికల ప్రచారంలో పెమ్మసాని, మనోహర్



బొప్పూడి సభకు భారీగా సన్నాహాలు

- ఏర్పాట్లపై ఉమ్మడిగా కసరత్తు
- శరవేగంగా సభా వేదిక పనులు
- భద్రతా చర్యలపై ఎస్పీజీ బృందం సమీక్ష

చిలకలూరిపేట, మార్చి 14: టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు ఖరారు అయిన తర్వాత తొలిసారి చిలకలూరిపేట మండలం బొప్పూడి వేదికగా 17వ తేదీ ఆదివారం జరిగే బహిరంగ సభకు భారీగా సన్నాహాలు జరుగుతున్నాయి. సభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరుకానున్న నేపథ్యంలో ఎస్పీజీ బృందం రంగంలోకి దిగింది. పటిష్ఠమైన బందోబస్తుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. భారీగా భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. వేదిక వద్ద ఏర్పాట్లను ఎస్పీజీ బృందం గురువారం పరిశీలించింది. భద్రతా చర్యలపై కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డిలతో ఎస్పీజీ బృందం సమీక్షించింది. టీడీపీ నేతల నుంచి సభా ప్రాంగణానికి సంబంధించిన వివరాలను ఎస్పీజీ అధికారులు తీసుకున్నారు. ఉమ్మడి సభ వేదికగా ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్‌కళ్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఈ క్రమంలో సభను విజయవంతం చేసేందుకు మూడు పార్టీల నాయకులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. దాదాపు 15 లక్షల మంది సభకు హాజరయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. బొప్పుడి వద్ద జాతీయ రహదారికి అనుకుని ఉన్న 200 ఎకరాల్లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సభా వేదిక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు రోజులే సమయం ఉండటంతో యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణా, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ఎక్కువగా జనసమీకరణ చేయాలని నేతలు నిర్ణయించి ఆ మేరకు ప్రణాళికలు రూపొందించారు. సభకు హాజరయ్యే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగని రీతిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. హెలికాప్టర్లలో రానున్న ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కోసం ప్రత్యేకంగా హెలిప్యాడ్‌లను సిద్ధం చేస్తున్నారు. ఏర్పాట్లను మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పర్యవేక్షిస్తున్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, రామారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితర టీడీపీ నేతలు పరిశీలించారు.

సభ దద్దరిల్లాలి: మాజీ మంత్రి ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్: నవ్యాంధ్ర భవిష్యత్‌కు దశ, దిశ చూపే బొప్పూడి ఉమ్మడి సభ దద్దరిల్లాలని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. చిలకలూరిపేటలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో కలిసి పుల్లారావు మాట్లాడుతూ సిద్ధం పేరిట గ్రాఫిక్స్ చూపించిన జగన్‌కు కలలో కూడా చిలకలూరిపేట సభే కనపడాలని ఇందుకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కష్టపడాలన్నారు. ప్రధాని మోదీ పాల్గొనే ఈ సభను విజయవంతం చేయడం ద్వారా ఢిల్లీలో శ్రీకృష్ణ దేవరాయలు కనపడితే సభకు గుర్తుకు వచ్చేలా చేయాలన్నారు. 2014లో టీడీపీ ఎన్డీఏలో చేరినప్పుడు నిర్వహించిన సభకు ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా తానే అధ్యక్షత వహించినట్లు గుర్తు చేశారు. ఆ సభను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేశామని, 2014 సభ తర్వాత టీడీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు అదే సెంట్‌మెంట్‌ను కొనసాగించాలన్నారు.


బందోబస్తుపై టీడీపీ నేతలతో చర్చిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీజీ అధికారులు


సభావేదిక నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు


శరవేగంగా సాగుతున్న సభావేదిక నిర్మాణ పనులు

సీఎం జగన్ రాజీనామా చేయాలి

● గ్రూప్-1 మెయిన్స్‌పై అభ్యర్థుల అభియోగాలను ధ్రువీకరించిన కోర్టు
● నైతిక బాధ్యత సీఎం జగన్, ఇప్పటి ఏపీపీఎస్సీ చైర్మన్‌లదే..

సత్తెనపల్లి మార్చి 14: ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహించిన గ్రూప్-1 పోస్టుల ఎంపిక ప్రక్రియను హైకోర్టు తప్పుపట్టినందున, అందుకు సీఎం జగన్ నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎంపిక ప్రక్రియను హైకోర్టు తప్పు పట్టిందని అన్నారు. మెయిన్స్ పరీక్షా పత్రాల రీ-వాల్యుయేషన్‌ను ప్రొఫెసర్ల చేత కాకుండా డిగ్రీ కళాశాలల అధ్యాపకులతో చేయించారని అభ్యర్థులు మోపిన అభియోగాన్ని కోర్టు నిర్ధారించిందన్నారు. దీనికంటే అవమానం ఈ ప్రభుత్వానికి ఇంకొకటి లేదన్నారు. ఏపీపీఎస్సీ చైర్మన్‌తో పాటూ సీఎం జగన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి సీతా రామాంజనేయులు అత్యున్నత నియామక ప్రక్రియ అయిన గ్రూప్-1 పోస్టుల ఎంపికను ఇష్టారాజ్యంగాచేశారని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ ఇవ్వగా మెయిన్స్ ప్రక్రియ అంతా వైసీపీ ప్రభుత్వ పాలనలోనే జరిగిందన్నారు. అప్పటి ఏపీపీఎస్సీ చైర్మన్‌గావున్న ఉదయభాస్కర్‌ను ప్రక్కన పెట్టి కార్యదర్శిగా ఉన్న సీతారామాంజనేయులు అక్రమాలకు పాల్పడ్డారని, అనంతరం ఆ పదవిలోకి వచ్చిన గౌతమ్ సవాంగ్ దీనికంతా బాధ్యత వహించాలని కన్నా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.



బిలోలి కోర్టులో విచారణకు హాజరైన మాజీ మంత్రి ఆనందబాబు

బాబ్లీ కేసులో ఆనందబాబుకు సమన్లు

● బిలోలి కోర్టులో విచారణకు హాజరు

వేమూరు, మార్చి14: మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు ఉద్యమం సందర్భంగా నమోదైనకేసులో మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబుకు బిలోలి కోర్టు సమన్లు జారీ చేసింది. గురువారం ఆయన మాజీ మంత్రి దేవినేని ఉమతో పాటు బిలోలి కోర్టుకు హాజరయ్యారు. గోదావరి నదిపై మహారాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు ఆనకట్ట ఏర్పాటు చేసింది. దిగువకు రావలసిన నీటిని సకాలంలో రానీయకుండా గేట్లు వేయడం జరిగింది. దీంతో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సాగునీరు సకాలంలో అందక రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో టీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఉద్యమంలో మహారాష్ట్ర ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. అందులో ఆనందబాబు పేరును కూడా చేర్చడం జరిగింది. సంబంధించిన కేసు విషయంపై బిలోలి కోర్టు తాజాగా సమన్లు జారీ చేయడంతో పాటు కోర్టులో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. దీంతో ఆనందబాబు గురువారం విచారణకు కోర్టుకు హాజరయ్యారు. వారెంట్లు రీ కాల్ చేయాలని న్యాయవాదులు గింజుపల్లి సుబ్బారావు, కృష్ణారెడ్డిలు కోర్టును కోరడం జరిగింది. న్యాయవాదుల అభ్యర్థన మేరకు తాత్కాలికంగా కేసు విచారణను నిలుపుదల చేయడం జరిగింది.

రాష్ట్రంలో అడ్డగోలుగా ఇసుక దోపిడి



ఇసుక గుట్టలను పరిశీలిస్తున్న పెమ్మసాని నాదెండ్ల మనోహర్

● ప్రజలే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి...
● పెమ్మసాని, నాదెండ్ల

కొల్లిపర, మార్చి 14: రాష్ట్రంలో ఎక్కడ చూసినా అక్రమ ఇసుక నిల్వలు కనిపిస్తున్నాయని దొంగల దోపిడీ కొనసాగుతోందని గుంటూరు పార్లమెంట్ టీడీపీ నేత డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం తెనాలి నియోజకవర్గం ప్రచారం కార్యక్రమంలో భాగంగా అత్తోటనుంచి కొల్లిపర వెళ్లే దారిలో అక్రమ ఇసుక నిల్వలు పరిశీలించిన సందర్భంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నేతలు ఓ పక్క ఇసుకను దోచుకుంటూ సంక్షేమం అని చెప్పుకుంటు న్నారన్నారు. 25 టన్నుల నుంచి 30 టన్నుల వరకు వెళ్ళుతున్న భారీ ఇసుక వాహనాలను గుర్తించడం జరిగిందన్నారు. ఆ ఇసుక వాహనాలు ఎక్కడకు వెళ్ళుతున్నాయని ప్రశ్నించగా డ్రైవర్లు నోరు మెదపలేదన్నారు. ఈ సందర్భంగా జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పట్టపగలే అక్రమంగా తరలిస్తున్న ఈ ఇసుక వాహనాలకు అనుమతులు ఉన్నాయా, అర్ధరాత్రి సమయాల్లో తవ్వకాలకు అనుమతులు ఎవరిచ్చారని చూపాలని డిమాండ్ చేశారు. ఇలాంటి పాలకులకు యలా బుద్ధి చెప్పాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులు వచ్చి రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోజుకు వెయ్యికి పైగా లారీ ట్రక్కులతో ఇసుకను తరలిస్తున్నారని, తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని వారి దృష్టికి తీసుకువచ్చారు.

పల్నాడు ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తా

● ఏడోసారి టిక్కెట్ కేటాయించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు
● గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మార్చి14: గురజాల నియోజకవర్గం నుంచి రాబోయే ఎన్నికల్లో టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేసే అవకాశం కల్పించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు యరపతినేని శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. రెండవ జాబితాలో గురజాల అభ్యర్థిగా పేరు ప్రకటించిన తరువాత యరపతినేని విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 1994లో ఎన్టీఆర్ ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చానని, అప్పటి నుంచి గురజాల ప్రజలకు అండగా వుంటున్న తనకు వరుసగా ఏడోసారి గురజాల టిక్కెట్ ప్రకటించడం జరిగిందన్నారు. గతంలోనే గురజాల నియోజకవర్గంలో రూ.వేల కోట్లతో అభివృద్ధి చేశామని, కృష్ణా పుష్కరాల సమయంలో వేల కోట్లతో అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. రేపటి ఎన్నికల్లో గెలుపొందిన తరువాత గురజాల ప్రాంత అభివృద్ధి, గురజాల ఓటర్ల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయనున్నట్లు స్పష్టంచేశారు. మాచవరం మండలంలో సరస్వతి ఫ్యాక్టరీకి భూములిచ్చిన రైతులపై వైసీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడితే రైతులకు అండగా ఉన్నందుకే జగన్ తనపై కక్షకట్టి అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టాలని చూశాడన్నారు. మొన్నటిదాకా వైనాట్ 175 అన్న జగన్ నేడు వైరాగ్యంతో ఓడినా ఇబ్బందేమి లేదన్నట్లు మాట్లాడుతున్నాడని అన్నారు. పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు గురజాల నియోజకవర్గంలో తానుకూడా సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశపెట్టబోతున్నట్లు తెలిపారు. అదేవిధంగా గతంలో తాను చేపట్టిన పసుపు కుంకుమ, సీమంతం, షష్టిపూర్తి కార్యక్రమాలను కొనసాగించడంతో పాటు యువతకు జాబ్‌మేళాను అందుబాటులోకి తీసుకొస్తానన్నారు. తాగునీటి ప్రాజెక్టులు, కాల్వల ఆధునికీకరణతో చివరి భూముల వరకు సాగునీరు అందేలా చేస్తానని స్పష్టం చేశారు. పిడుగురాళ్ల బైపాస్ రహదారి, మెడికల్ కళాశాలను అసంపూర్తిగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రారంభించారన్నారు. పల్నాడులో శాంతిని నెలకొల్పేందుకు తాను మొదటిసారి ఎమ్మెల్యే అయిన తరువాత కాంగ్రెస్ నేతల ఇళ్లకు కూడా వెళ్లి రాజీతో ఎన్నో గ్రామాల్లో ఫ్యాక్షన్ లేకుండా చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ వైసీపీ పాలనలో పురంశెట్టి అంకులు, దోమతోటి విక్రమ్‌తో పాటు మరెందరినో పొట్టన పెట్టుకోవడమే కాకుండా అక్రమమైనింగ్‌తో 8 మంది చిన్నారులు మృత్యువాత పడినా వైసీపీ నేతలు మాత్రం అక్రమ సంపాదనను వదలలేదన్నారు. ఈనెల 17న చిలకలూరిపేటలో జరిగే భారీ బహిరంగసభకు గురజాల నియోజకవర్గం నుంచి 30 వేల మంది పార్టీ శ్రేణులు హాజరయ్యేలా చూస్తున్నామన్నారు. సమావేశంలో గుంటుపల్లి నాగేశ్వరరావు, తురకా వీరస్వామి, షేక్ బాబావలి, మల్లెల ఆదినారాయణ, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పాండురంగ శ్రీను, కామిశెట్టి రమేష్, కనిగిరి శ్రీను, మునగా వెంకట్, మేకల సాంబశివరావు, గండికోట వెంకటేశ్వర్లు, పణితి రవి, చెన్నారావు, ఖాశింసైదా, శివనాగు, అడపా శ్రీనుతో పాటు తదితర నేతలు పాల్గొన్నారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మన్నవ మోహన కృష్ణ

అధినేత ఆదేశానుసారమే నడుస్తాం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ

గుంటూరు,మార్చి 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత నారా చంద్రబాబు ఆదేశానుసారమే తాము నడుస్తామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ అన్నారు. గురువారం ఆయన చంద్రబాబును కలిసి పశ్చిమ నియోజకవర్గ పరిస్థితి గురించి వివరించారు. తాజా పరిణామాల రీత్యా పశ్చిమ సీటు బీసీ అభ్యర్థికి కేటాయించాల్సి వచ్చిందని అధినేత తనతో చెప్పారని, ప్రకటించిన అభ్యర్థిని గెలి పించేందుకు కృషిచేయాలని కోరినట్లు మన్నవ తెలిపారు. అధినేత చంద్రబాబు ఆదేశానుసారమే పశ్చిమ కూటమి అభ్యర్థి గెలుపు కోసం ఐక్యంగా కృషచేస్తామని మన్నవ తెలిపారు.

మెరిసిన పసుపు ధర

● క్వింటాల్ ధర రూ.15 వేలకు పైగా అమ్మకం

దుగ్గిరాల, మార్చి 14: పసుపు క్వింటాల్ ధర రూ.15వేలను దాటి పలికింది. స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో గురువారం జరిగిన వేలంలో 847 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. పసుపు ధర గరిష్టంగా కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ట ధర రూ.10,450, గరిష్ట ధర రూ.15,400 మోడల్ ధర రూ.15,311 పలికాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ట ధర రూ.10,450, గరిష్ట ధర రూ.15,400 మోడల్‌ధర రూ.15,311 పలికాయి. ఆశాజనకంగా పసుపు ధర పెరుగుదల కొనసాగుతుండటంతో రైతులు వేచిచూసే ధోరణిలో ఉండడంతో విక్రయాలకు ముందుకు రావడంలేదు.

లిఫ్ట్ ఇస్తారు.. దోచేస్తారు

● ఒంటరి ప్రయాణికులే లక్ష్యంగా దోపిడీ
● ఏపీకి చెందిన దంపతులు నల్లగొండ జిల్లాలో అరెస్టు

నల్లగొండ టౌన్, మార్చి 14: లిఫ్ట్ ఇస్తామంటూ ఒంటరి ప్రయాణికులను నమ్మించి కారులో ఎక్కించుకుని దారిదోపిడీకి పాల్పడిన ఏపీకి చెందిన దంపతులను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కె.శివరాంరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఏపీలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన చిమట గోపీకృష్ణ తన మొదటి భార్యతో గొడవ పెట్టుకుని ఒంటరిగా ఉండేవాడు. సత్తెనపల్లికే చెందిన వితంతువు చింత మహేశ్వరి తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తోంది. కారు డ్రైవర్ అయిన గోపీకృష్ణ, కూలి పనులు చేసుకునే మహేశ్వరి ఏడాది క్రితం వివాహం చేసుకున్నారు. గోపీకృష్ణ, మహేశ్వరి దంపతులు తమ సంపాదన సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఒంటరిగా ప్రయాణం చేసే వారిని లిఫ్ట్ పేరుతో నమ్మించి కారులో ఎక్కించుకుని దారిలో వారిని దోచుకోవాలని పథకం వేసుకున్నారు. ఈక్రమంలో హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నివాసముండే దుగ్గి కృష్ణారావు తన స్వస్థలం సత్తెనపల్లి మండలం బూరుగుపాడులో ఈ నెల 10న జరిగిన తన బంధువు అంత్యక్రియల్లో పాల్గొని అదేరోజు రాత్రి తిరుగుప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో పిడుగురాళ్ల నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తుండగా గమనించిన గోపీకృష్ణ దంపతులు తమ నాటకం మొదలుపెట్టారు. ముందుగా సిద్ధం చేసుకున్న అద్దె కారులో కృష్ణారావు వద్దకు వెళ్లి తామూ హైదరాబాద్ వెళుతున్నామని, లిఫ్ట్ ఇస్తామని నమ్మించి వాహనంలో ఎక్కించుకున్నారు. కారు నల్లగొండకు చేరుకోగానే దేవరకొండ రోడ్డులోని కొత్తపల్లి గ్రామ శివారుకు తీసుకెళ్లి ఆపారు. వెంటనే తమ వద్ద ఉన్న కత్తులను బయటకు తీసి కృష్ణారావును చంపేస్తామని బెదిరించి.. అతని వద్ద ఉన్న 15 గ్రాముల బంగారు గొలుసు తీసుకుని పరారయ్యారు. ఈ చోరీపై కృష్ణారావు 11వ తేదీన నల్లగొండ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా కారును గుర్తించారు. మర్రిగూడ బైపాస్‌లో బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టి నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి కారు, 15గ్రాముల బంగారు గొలుసు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు.



తక్కెళ్లపాడు గ్రామంలో మాట్లాడుతున్న ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు

పల్నాడుకి తాగునీరుని అందిస్తాం

● ఎంపీ లావు, మాజీ ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి మార్చి14: గోదావరి జలాలను సాగర్ కుడికాలువలో కలిపి పల్నాడు ప్రాంతానికి తాగునీరు అందిస్తామని నరసరావుపేట టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. గురువారం దాచేపల్లి మండలం తక్కెళ్లపాడు గ్రామంలో సర్పంచ్‌గా కిచ్చంశెట్టి లక్ష్మీనారాయణ ప్రమాణస్వీకార కార్యక్రమానికి టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థులుగా పోటీ చేయనున్న ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎంపీ లావు కృష్ణదేవరాయలు మాట్లాడుతూ గత నాలుగేళ్ల క్రితం జలజీవన్ మిషన్ ద్వారా రూ.50 కోట్ల నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుకు నిధులు తీసుకొచ్చి నిర్మాణం పూర్తిచేయడంతో పాటు మరికొద్ది రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి రానుందని వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, తానుకలిసి గురజాల నియోజకవర్గంలో 50 కిలోమీటర్లు సీసీ రోడ్లు నిర్మిస్తామని, రూ.50 కోట్లతో సైడ్ డ్రైన్స్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ముస్లింలకు షాదీఖానాలు, కమ్యూనిటీ హాల్స్, పంట పొలాలకు రహదారులు నిర్మిస్తామని తెలిపారు. మాజీ సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తిట్టడంతోనే ఓట్లు రావు.. పనిచేస్తేనే ఓట్లు వస్తాయని ఎంపీ లావు అధికార పార్టీ నేతలకు పరోక్షంగా సూచనలు చేశారు. యరపతినేని మాట్లాడుతూ.. పల్నాడులో కులాల కుంపటి పెట్టి రక్తపాతం సృష్టించాలని చూస్తున్నారని, టీడీపీ జనసేన కార్యకర్తలు సమన్వయాన్ని కోల్పోవద్దని అన్నారు. తక్కెళ్లపాడును గత టీడీపీ ప్రభుత్వం అన్నివిధాల అభివృద్ధి చేసిందని, మరో రెండు నెలల్లో రాష్ట్రంలో టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వం రాబోతుంది. చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగాలిప్పిస్తాం అని యరపతినేని శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. కార్యక్రమాల్లో గుంటుపల్లి నాగేశ్వరరావు, కన్నా రజని, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, కర్నాటి వరలక్ష్మి, బడిదల శ్రీనివాస్, వేముల వినోద్‌రెడ్డి, కామిశెట్టి శ్రీనివాస్, అక్కినపల్లి బాలయ్య, బాలాజీనాయక్, నర్రా పుల్లయ్య, పగడాల భాస్కరరావు, రుద్రాల అచ్చారావు, వేముల తిరుమలకుమార్, మామిడి చంద్రశేఖరరావు, బుర్రి కొండలు, చింతపల్లి హసన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మం గెలిచింది : ప్రత్తిపాటి

● తన కుమారుడు శరత్‌కు బెయిల్ రావడంపై పుల్లారావు

చిలకలూరిపేట, మార్చి14: రాష్ట్ర ప్రభుత్వ అక్రమ కేసులపై న్యాయం గెలిచిందని, జగన్‌రెడ్డి నియంత నిర్ణయాలకు న్యాయవ్యవస్థ చెక్ పెట్టిందని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అన్నారు. జీఎస్టీ కేసులో తన కుమారుడు శరత్‌కు బెయిల్ లభించడంపై ప్రత్తిపాటి స్పందించారు. జీఎస్టీకి సంబంధించి ప్రత్యేక చట్టం, వ్యవస్థ ఉన్నా, అవేవీ పట్టించుకోకుండా శరత్‌ను జగన్‌రెడ్డి కక్ష పూరితంగా అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు న్యాయవ్యవస్థ జోక్యం చేసుకొని చట్టాలను కాపాడిందన్నారు. అవెక్సా కార్పొరేషన్ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పొందే సమయానికి శరత్ కంపెనీలో ప్రవేశించలేదని, కేవలం 67 రోజులు మాత్రమే ఆ సంస్థలో డైరెక్టర్‌గా ఉన్నారని వివరించారు. జీఎస్టీ నేరాలకు సంబంధించి ప్రత్యేక చట్టం ఉందని, దానినికాదని ఐపీసీ కింద పోలీసులు కేసు ఎలానమోదు చేస్తారని పుల్లారావు ప్రశ్నించారు. శరత్ అరెస్టును ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సంపూర్ణ మద్దతు తెలిపారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. శరత్ త్వరగా జైలు నుంచి బయటకు రావాలని చిలకలూరిపేట నియోజకవర్గ ప్రజలంతా పూజలు, ప్రార్థనలు చేశారని, అవన్నీ ఫలించాయన్నారు. 15 రోజులుగా నిరసనలు తెలిపిన తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారంలో ఉన్నవారు ప్రతిపక్షాలపై పోలీస్ వ్యవస్థను ప్రయోగించడం పెత్తందారీతనం అవుతుందని, ప్రజాస్వామ్యం కాదని, ఈ తరహా చర్యలు ప్రజాస్వామ్య మనుగడకు గొడ్డలిపెట్టని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న విపరీత పోకడల గురించి విద్యావంతులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో నియంత పాలనకు ముగింపు పలికేలా ఓటు అనే ఆయుధాన్ని వినియోగించాలన్నారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రకాశ్ చౌహాన్ తదితరులు

ఎస్ఆర్ఎంలో అంతర్జాతీయ పర్యావరణ సదస్సు

మంగళగిరిసిటీ, మార్చి14: మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఆధునిక పర్యావరణ సమతుల్యత అనే అంశంపై మూడు రోజులపాటు జరిగే అంతర్జాతీయ నిపుణులసదస్సు గురువారం ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ చౌహాన్ ఈ సదస్సును ప్రారంభించారు. ఎస్ఆర్ఎం ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు వివిధ ప్రాంతాలనుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో వందలాది మంది విద్యార్థులు, ప్రొఫెసర్లు హాజరయ్యారు. సెంటర్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ వేస్ట్ టెక్నాలజీ (యూఎస్ఏ) ప్రొఫెసర్ ప్రకాశం టాటా కీలక ఉపన్యాసం అందించారు. యూనివర్సిటీ విద్యార్థులు తయారుచేసిన 165 పరిశోధనా రంగ ప్రచురణల్లో 106 ఆర్టికల్స్ క్యూవన్ జర్నల్స్‌లో ప్రచురితం కావడం విశేషమని డాక్టర్ రంగభాష్యం పేర్కొన్నారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన అబ్‌స్ట్రాక్ట్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సలహాదారు ప్రొఫెసర్ వీఎస్ రావు, కోఆర్డినేటర్లు డాక్టర్ పంకజ్ పాఠక్, డాక్టర్ శోభశ్రీ కోదండరామన్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతిపై ఆగని విచ్ఛిన్నం..

● ఇప్పటికే రాష్ట్రాన్ని అధోగతి పట్టించిన జగన్‌రెడ్డి
● 1549వ రోజుకు రైతుల ఆందోళనలు



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

తుళ్ళూరు, మార్చి14: సీఎం పదవి నుంచి తాను దిగిపోయే ముందుకూడా రాజధాని అమరావతిని విచ్చినం చేయటం కోసం సీఎం జగన్‌రెడ్డి ప్రయత్నం చేయటం దుర్మార్గమైన చర్య అని 33 వేల ఎకరాలు భూములు త్యాగంచేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారంనాటికి 1549వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతుధర్నా శిబిరాల నుంచి పలువురు మాట్లాడుతూ.. భూ సమీకరణ చేసి అమరావతి నిర్మాణం చేయాల్సి ఉండగా.. సేకరించిన భూములను వెనక్కి ఇచ్చేసి అమరావతి మాస్టర్ ప్లాన్‌ను నాశనం చేయాలని సీఎం జగన్‌రెడ్డి కుట్రపన్నారన్నారు. 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో నిర్మితం కావల్సిన అద్భుతమైన అమరావతి నగరం రూపురేఖలు మార్చివేసి జగన్‌రెడ్డి సునకానందం పొందాలనుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చీకటి జీవోలు, రహస్య గెజిట్‌లతో ఐదేళ్ల పాలనకు పారదర్శకత లేకుండా చేశారని దుయ్యబట్టారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అమరావతిని అభివృద్ధి చేయమని తీర్పుచెప్పినా పట్టించుకోని నియంత సీఎం పాలనలో రాజధాని విధ్వంసానికి గురైందని, ఇలాంటి సీఎం రాష్ట్రాభివృద్ధి గురించి ఏం పట్టించుకుంటాడని అన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో రైతుల, మహిళల ఆందోళనలు కొనసాగాయి.

వలిగొండ - కుక్కడం మధ్యన

డబ్లింగ్‌కు నోటిఫికేషన్ జారీ

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో కీలకమైన వలిగొండ - కుక్కడం సెక్షన్ విద్యుద్దీకరణతో రెండో మార్గం నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో టెండర్ పిలిచింది. మొత్తం 75 కిలోమీటర్ల పొడవునా ఈ సెక్షన్ నిర్మాణం జరగనుంది. ఇందులో వలిగొండ వద్ద మూసీ నదిపై భారీ వంతెన నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంటుంది. అలానే ఎన్ఎస్‌పీ లెఫ్ట్ మెయిన్ కెనాల్ పైనా హైలెవల్ బ్రిడ్జీ నిర్మించాలి. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.853.08 కోట్లు ఖర్చు అవుతుందని రైల్వేశాఖ అంచనా వేసింది. టెండర్ అప్‌లోడింగ్ ఇప్పటికే ప్రారంభం కాగా ప్రీబిడ్ సమావేశం వచ్చే నెల 26వ తేదీన జరగనుంది. జూన్ 6వ తేదీన టెండర్‌ను ఖరారు చేస్తారు. మొత్తం 33 నెలల వ్యవధిలో ఈ ప్రాజెక్టుని పూర్తి చేయాల్సి ఉంటుందని రైల్వే శాఖ నిబంధనల్లో పొందుపరిచింది.

విద్యార్థులతో పనులు ..

● మండిపడుతున్న తల్లిదండ్రులు





పాఠశాలలో పనులు చేస్తున్న విద్యార్థులు

కారంపూడి, మార్చి 14: మండల కేంద్రమైన కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్లో అక్కడి ఉపాధ్యాయులు విద్యార్థులతో పనులు చేయించడం వివాదా స్పదంగా మారుతుంది. హెచ్‌ఎం అనంతశివ విద్యార్థులతో స్కూల్ గ్రౌండ్ ఊడిపించడం, క్లాస్ రూమ్‌లను శుభ్రం చేయించడం, బరువులు మోపించడం, కోడిగుడ్లు, కూరగాయలు ఒలిపించడం వంటి పనులు చేయిస్తున్నారు. చదువు చెప్తారని పాఠశాలకు పంపిస్తుంటే పనులు చేయించడమేంటని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

1,27,998 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,36,004 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,27,998 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 93,750 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	19000
నెంబరు. 5	10500	19000
273	13000	14500
341	10000	19000
4884	11000	15800
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	10000	19800
దేవనూరు డీలక్స్	10000	18000
తెల్లకాయలు	5000	12500

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.18 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

● తూర్పు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మొహమ్మద్ నసీర్

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని తూర్పు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మొహమ్మద్ నసీర్ తెలిపారు. తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా నసీర్‌ను గురువారం ప్రకటించడంతో నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బస్టాండు సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తనపైవుంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి సమస్యపై తనకు అవగాహన ఉందని, వాటి పరిష్కారానికి కృషిచేయడానికి గుంటూరు తూర్పు ప్రజలందరూ తనను ఆశీర్వదించాలని కోరారు. గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు.



నిమ్మల శేషయ్య, తాళ్ల వెంకటేష్ యాదవ్‌లను కలిసిన కోవెలమూడి రవీంద్ర

అధినేత నిర్ణయమే శిరోధార్యం: కోవెలమూడి

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పార్టీ అధినేత చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యమని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర అన్నారు. గురువారం ఆయన గుంటూరు పశ్చిమ సీటు ఆశించిన డాక్టర్ నిమ్మల శేషయ్య, తాళ్ల వెంకటేశ్ యాదవ్ ఇళ్లకు వెళ్లి వారిని కలుసుకున్నారు. అధినేత చంద్రబాబు గురువారం విడుదల చేసిన రెండో జాబితాలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా బీసీ మహిళ పిడుగురాళ్ల మాధవికి అవకాశం కల్పించారని, అధినేత నిర్ణయానికి విలువిచ్చి అందరూ కలిసి మాధవిని గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇద్దామని వారికి వివరించారు. రవీంద్ర సూచనల మేరకు పిడుగురాళ్ల మాదవి గెలుపునకు కృషి వారు ఏకాభ్రిప్రాయం వ్యక్తం చేశారు.

బీసీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తా: నిమ్మల శేషయ్య

పశ్చిమ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా నియమితులైన బీసీ మహిళ పిడుగురాళ్ల మాధవి విజయానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని పశ్చిమ టీడీపీ నేత నిమ్మల శేషయ్య తెలిపారు. మాధవి విజయానికి తన వంతు సహాయ, సహకారాలు అందజేస్తానని చెప్పారు. జనసేన, బీజేపీ మద్దతుతో మాధవి మంచి మెజారిటీతో గెలుపొందడం ఖాయమన్నారు.

కోవెలమూడి రవీంద్రను కలిసిన మాధవి దంపతులు



నానిని కలిసిన మాధవి దంపతులు

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా నియమితులైన పిడుగురాళ్ల మాధవి, తన భర్త గళ్లా రామచంద్రరావుతో కలసి గురువారం టీడీపీ పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్రను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మందవి దంపతులను నాని దుశ్శాలువాతో సన్మానించారు. మాధవి గెలుపునకు అన్నివిధాలా కృషి చేస్తానని నాని వారికి భరోసా ఇచ్చారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు

● డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెనుముప్పు

● పూర్తిగా దగ్ధమైన బస్సు ● 25 మంది ప్రయాణికులు సురక్షితం

గుంటూరు, మార్చి 14 : ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగి బస్సు అగ్నికి ఆహుతి అయిన ఘటన గురువారం రాత్రి గుంటూరు నగర శివారు మిర్చియార్డ్ వై జంక్షన్ సమీపంలో కలకత్తా-చెన్నై జాతీయ రహదారిపై జరిగింది. డ్రైవర్ అప్రమత్తతో ఘోర ప్రమాదం తప్పింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం విజయవాడ నుంచి బెంగళూరుకు ఎస్‌వీకేడిటి ట్రావెల్స్ బస్సు 25 మంది ప్రయాణికులతో బయలుదేరింది. బస్సు గురువారం రాత్రి గుంటూరు మిర్చియార్డ్ వై జంక్షన్ సమీపానికి రాగానే బస్సు ఇంజన్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును ఆపి ప్రయాణికులను కిందకు దించారు. ఆ తర్వాత కొద్ది నిమిషాలలోనే మంటలు బస్సును చుట్టుముట్టాయి. అనంతరం అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. డ్రైవర్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పినట్లయింది. అంతేగాక ప్రయాణికులు కూడా నిద్రమత్తులోకి జారుకోక పోవడంతో త్వరగా కిందకు దిగగలిగారు. ఎటువంటి ప్రాణ నష్టం లేకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చలరేగినట్లు అనుమానిస్తున్నారు. నల్లపాడు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16న నాదెండ్ల బ్రహ్మయ్య సంస్మరణ సభ

గుంటూరు,మార్చి 14: సీపీఐ(ఎంఎల్)న్యూడెమొక్రసీ జిల్లా మాజీ కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మయ్య సంస్మరణ సభ ఈనెల 16న స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో జరుగనుందని దళిత, బహుజన, ప్రజా సంఘాల నేతలు తెలిపారు. ఈమేరకు గురువారం అంబేద్కర్ భవన ప్రాంగణంలో సంస్మరణ సభ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాది శిఖా సురేష్ మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, దళిత, బహుజన, వామపక్ష, ప్రజాసంఘాల పాల్గొంటారని తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ బృందాల తనిఖీలు

● 188 మందికి రూ. 10.88 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, మార్చి 14: గుంటూరు విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీపీఈ) కే.సూర్యప్రకాష్, గుంటూరు టౌన్-1 డివిజన్ ఆపరేషన్ ఈఈ టీ.శ్రీనివాసబాబుల ఆధ్వర్యంలో గురువారం డీ-11సెక్షన్ పరిధిలో 59 మంది అధికారులు, 175 మంది సిబ్బంది 59 బృందాలుగా విడిపోయి తనిఖీలు నిర్వహించారు. ఆయా బృందాలు విద్యానగర్, నవభారత్ నగర్, భారత్‌పేట, ద్వారకానగర్, వికాస్‌నగర్‌లో మొత్తం 4534 సర్వీసులు తనిఖీ చేశారు. అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతోన్న 188 మందికి రూ.10.88 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. మీటరు ఉండి అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడటం, అనుమతించిన కేటగిరీ కంటే వేరొక కేటగిరీలో వాడుకోవటం, అదనపు లోడు వినియోగించటంపై కేసులు నమోదుచేసినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, చౌర్యానికి పాల్పడేవారిపై 9440812263. 9440812360కు ఫోన్ చేసి లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

హమ్మయ్య.. అయిపోయాయ్ !

● నేటితో ముగియనున్న ఇంటర్ పరీక్షలు
● ఆనందోత్సవాల్లో విద్యార్థులు
● ఇక ఎంసెట్, జేఈఈ ప్రాక్టీస్ షురూ !

గుంటూరు(విద్య),మార్చి 14: గత 15 రోజులుగా జరుగుతున్న ఇంటర్‌పరీక్షలు నేటితో ముగియనున్నాయి. ఇప్పటికే ప్రథమ సంవత్సరం విద్యార్థుల పరీక్షలన్నీ గురువారంతో ముగిశాయి. దీంతో రెసిడెన్సియల్, హాస్టల్స్‌లో చదువుతున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నేటితో ముగియనున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం, వృత్తివిద్యాకోర్సుల విద్యార్థులు దాదాపు 59 వేల మందికిపై పరీక్షలకు హాజరయ్యారు. ఈ ఏడాది మాల్ ప్రాక్టీసు, కాపీయింగ్ కేసులు దాదాపు ఎక్కడా నమోదు కాలేదు. పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ముగియడంతో ఇంటర్ బోర్డు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు ఇప్పటికే ఇంటర్ పరీక్షల మూల్యాకనం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శరవేగంగా సాగుతోంది.పరీక్షలు పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆనందోత్సవాల నడుమ హాస్టల్స్‌ను వీడి ఇంటిబాట పట్టారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నేటితో పరీక్షలు ముగియడంతో వారికి ఓ వారం పాటు ప్రైవేటు కళాశాలలు సెలవులు ప్రకటించనున్నాయి. తర్వాత ఎంసెట్, జేఈఈ రెండోవిడత, అడ్వాన్స్ పరీక్షలకు వారిని సిద్ధం చేసేందుకు యాజమాన్యాలు సన్నాహాలు చేస్తున్నాయి.



కేంద్రాల నుంచి వస్తున్న విద్యార్థులు





ఇంటికి వెళ్లొస్తాం ..



పరీక్షలు ముగిసిన సంతోషంలో విద్యార్థులు..



విద్యార్థినుల విజయ దరహాస సంకేతం..

ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

● నగర కమిషనర్ కీర్తి చేకూరి
● ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై శిక్షణ

గుంటూరు, మార్చి14: సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియామవళిని పకడ్బందీగా అమలు చేయటానికి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీంలు (ఎంసీసీ) ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌వో కీర్తి చేకూరి తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ద్వారా నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కోడ్ వచ్చిన వెంటనే ఎంసీసీ బృందం విధుల్లో ఉండాలని, రాజకీయ పార్టీల పోస్టర్స్, బ్యానర్స్, హోర్డింగ్స్, బోర్డులను తక్షణం తొలగించాల్సి ఉంటుందన్నారు. ప్రింటింగ్ ప్రెస్ పేరు, అభ్యర్థి, పార్టీ పేర్లు లేకుండా పోస్టర్స్, బ్యానర్స్ ప్రింట్ చేస్తే వాటిని సీజ్ చేయాలని ఆదేశించారు. శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు తెలిపిన అంశాలతో పాటుగా ఎన్నికల సంఘం రూపొందించిన ఎంసీసీ హ్యాండ్ బుక్‌ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు, పార్టీలు, అభ్యర్థుల ఖర్చులు, మద్యం తరలింపు, నగదు, బహుమతులను అరికట్టేందుకు పూర్తి సన్నద్ధతతో ఉండాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు ప్రదీప్ కుమార్, శేషన్న, మాస్టర్ ట్రైనీలు, ఎంసీసీ విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి తదితరులు

ఓటర్ల జాబితాపై క్లెయిమ్స్‌ను పరిష్కరించాలి..

తూర్పు,పశ్చిమ నియోజకవర్గాలవారీగా ఓటర్ల జాబితాపైక్లెయిమ్స్‌ని వేగంగా పరిష్కారంచేయాలని, క్లెయిమ్స్ వారీగా బీఎల్వోలు, సూపర్‌వైజరీ అధికారులు బాధ్యత తీసుకోవాలని కమిషనర్, ఆదేశించారు. ఓటర్ల జాబితాపై అందిన ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై సూపర్‌వైజరీ అధికారులతో గురువారం కమిషనర్ చాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు.



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న జేసీ రాజకుమారి,డీఎస్‌వో కోమలి పద్మ

ఎండీయూ వాహనాల తనిఖీ

గుంటూరు సిటీ,మార్చి 14: నగరంలోని ఎండీయూ వాహనాల పనితీరును జేసీ రాజకుమారి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్డుదారులని సరుకుల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం ప్రాముఖ్యతని కార్డుదారులకి వివరించారు. ఆపరేటర్ సరుకులు సరిగా ఇస్తున్నారా.. డబ్బులు తీసుకుంటున్నారా అంటూ ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కోమలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

సంకీర్ణ కూటమి పునరాలోచించాలి

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రకటించిన అభ్యర్థులకు సంబంధించి సంకీర్ణ(టీడీపీ-జనసేన-బీజేపీ) కూటమి పునరాలోచన చేయాలని కాపు సంఘాల నాయకులు కోరారు. గురువారం సాయంత్రం స్థానిక అరండల్‌పేటలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కాపు సంఘాల నాయకులు సంకటి లక్ష్మణరావు, అమ్మా శ్రీనివాసనాయుడు, బొక్కిసం శివరాం తదితరులు మాట్లాడారు.

మార్క్స్ ఆశయాలను ప్రచారం చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు), మార్చి14: కారల్‌మార్క్స్ తన జీవితాంతం పీడిత ప్రజల విముక్తికి కృషిచేశాడని ఆయన ఆశయాలను, లక్ష్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేట, సీపీఐ కార్యాలయంలో గురువారం కారల్‌మార్క్స్ వర్ధంతిసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్స్ సామ్యవాద సిద్ధాంతాన్ని, అదనపు విలువ సిద్ధాంతాన్ని కార్మికవర్గానికి వివరించాలన్నారు. దోపిడీలేని సమాజం కోసం మార్క్స్ తాను జీవించినంత కాలం పాటుపడ్డాడని, ఆ వైపుగా రచనలను, కృషిని సాగించాడని వివరించారు. కార్యక్రమంలో అంజిబాబు, మాల్యాద్రి, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం

● రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ

గుంటూరు, మార్చి 14: మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రానికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవని రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ తెలిపారు. అరండల్‌పేటలోని గ్రంధాలయ సంస్థ ఎదుట చైర్మన్ బత్తుల దేవానంద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని మంత్రి విడదల రజని, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మేయర్ మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిలు ఆవిష్కరించారు. మందపాటి శేషగిరిరావు, బందా రవీంద్రనాధ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచట్టాలను ఉపసంహరించుకోవాలి

● సీపీఐ, సీపీఎం నేతల ధర్నా

గుంటూరు(తూర్పు), మార్చి14: రైతాంగానికి ఇచ్చిన హామీల మేరకు తక్షణమే నల్లచట్టాలను రద్దుచేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, పాశం రామారావులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక శంకర్‌విలాస్ సెంటర్లో రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో వామపక్ష, కార్మిక ప్రజాసంఘాలు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వామినాధన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతు ఉద్యమంలో మరణించిన కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, రైతులపై పెట్టినకేసులు ఎత్తివేయాలన్నారు. కార్యక్రమంలో కంచుమాటి అజయ్, కొల్లి రంగారెడ్డి, ముత్యాలరావు, కోటా మల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

17న జూనియర్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు),మార్చి14: న్యూ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు డిస్ట్రిక్ బాస్కెట్‌బాల్ ఆధ్వర్యంలో స్థానిక అంకిరెడ్డిపాలెంలోని బాస్కెట్ బాల్ కోర్టులో ఈనెల 17వ తేది ఉదయం 10 గంటలకు జూనియర్ బాల,బాలికల విభాగాల్లో బాస్కెట్‌బాల్ జట్లు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు బీ.రేవతి, కార్యదర్శి జీ.ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలకు 2006 తర్వాత పుట్టినవారు అర్హులని, ఎంపికలకు వచ్చేవారు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వివరాలకు 98663 34528 నెంబరును సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, మార్చి 14: నగరంలోని ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ బీ.రాజమోహన్‌రావు గురువారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

వైభవంగా స్వామి వారి శాంతి కళ్యాణం

గుంటూరు(తూర్పు), మార్చి14: స్థానిక మారుతి నగర్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ మారుతి దేవాలయ 38 వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజున గురువారం ప్రసన్నాంజనేయ స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, లక్ష నాగవల్లి దళార్చన, లక్ష తమలపాకుల పూజ, శాంతి కళ్యాణం వైభ వంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా టీ టీ డీ హిందు ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భక్తి సంకీర్తన ఆలరించింది. కార్యక్రమాలను ఆలయ కార్యదర్శి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

గ్రంథాలయ రికార్డుల తనిఖీ

గుంటూరు(తూర్పు), మార్చి14: స్థానిక బృందావన్ గార్డెన్స్, మహిళా, బాలల గ్రంధాలయాన్ని, రికార్డులను గురువారం గ్రంథాలయ శాఖ జిల్లా కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీ.సుబ్బరత్నమ్మను గ్రంథాలయ అధికారులు బీ. శంకుతల, బి సత్య శిరిష, సిబ్బంది పీ. కోటేశ్వరి, సుధాకర్, లక్ష్మీ సత్కరించారు.

2047 నాటికి 30 లక్షలకు పైగా సీఏల అవసరం

● మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్

గుంటూరు(విద్య),మార్చి 14: 'ఆర్థిక వ్యవస్థలో ప్రతి ఒక ట్రిలియన్ డాలర్ల వృద్ధికి, లక్షమంది చార్టర్డ్ అకౌంటెంట్ల అవసరం ఉందని, దేశానికి స్వాతం త్ర్యం వచ్చి వందేళ్ల పూర్తయ్యేనాటికి 30 లక్షల మంది సీఏల అవసరం ఉంటుంది' అనీ ఐసీఏఐ నూతన అధ్యక్షుడు రజింత్‌కుమార్ అగర్వాల్ ప్రక టించారని మాస్టర్‌మైండ్స్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ప్రస్తుతం ఐసీఏఐ ఆధ్వర్యంలో 4లక్షల మంది సీఏలు నమోదు చేసుకున్నారన్నారు. ఐసీఏఐ దేశం అంతటా 500 కంటే ఎక్కువ కళాశాలలు, పాఠశాలలతో ఒప్పందాలు కుదుర్చుకుందని, ఈమేరకు స్థానిక అధ్యాపకులను నియమించుకుని వారికి అవసరమైన మౌలిక వసతులు ఐసిఏఐ కల్పిస్తుందన్నారు. ఫలితంగా సొంత పాఠశాలలు, కళాశాలల్లో సిఏ కోర్సులను బోధించవచ్చు'నని పేర్కొన్నారు. గత ఏడాది విద్యార్థులను చేర్చడంలో ఐసిఏఐ పురోగతిని నూతన అధ్యక్షులు అగర్వాల్ ప్రకటించారని తెలిపారు. కొత్తగా అర్హత పొందిన 22,000 మంది చార్టర్డ్ అకౌంటెంట్లకు 138 కంపెనీలు ఆఫర్లు ఇచ్చి క్యాంపస్ ప్లేస్మెంట్లలో 9,000 మందికి పైగా విద్యార్థులను నియమించుకున్నారని చెప్పారు. దేశంలో ఒక విద్యార్థికి అత్యధికంగా రూ.24 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చినట్టు చెప్పారు. అదే సమయంలో విదేశాలలో అత్యధిక ప్యాకేజీ సంవత్సరానికి రూ.11 లక్షలుగా ఉందని వెల్లడించారు. విద్యార్థులందరికీ కలిసి గతేడాది సగటు ప్యాకేజీకి రూ.12 లక్షలుగా ఉందన్నారు. విద్యార్థులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు పలు రాష్ట్రాల్లో ప్రతేక రాయితీలు కూడా ఇస్తున్నట్టు వివరించారు.

విజయవాడ వ్యాట్ ఏసీ కార్యాలయం పరిధిలోకి

గుంటూరు 1, 2 డివిజన్‌లు

గుంటూరు, మార్చి 14: విజయవాడలోని వ్యాట్ అప్పీలేట్ అడిషనల్ కమిషనర్ కార్యాలయం పరిధిలోకి గుంటూరు- 1, 2 డివిజన్‌లను చేర్చుతూ ప్రభుత్వం గురువారం జీవో జారీ చేసింది. వ్యాపారులు వ్యాట్‌లోని అప్పీల్స్ పరిష్కారానికి ఇప్పటి వరకు తిరుపతిలోని కార్యాలయం వరకు వెళ్ళాల్సి వచ్చేది. గతంలో గుంటూరు జిన్నాటవర్ సెంటర్‌లోని వసుంధర భవన్‌లోనే అప్పీల్స్ డీసీ కార్యాలయం ఉండేది. రాష్ట్రవిభజనానంతరం తిరుపతికి తరలించారు. వ్యాపారులు వ్యాట్ అప్పీల్స్‌కు వెళ్ళాలంటే తిరుపతి వరకు వెళ్ళాల్సి వస్తోంది. దీనిపై పలు దఫాలు వ్యాపారులు, టాక్స్ ప్రాక్టీషనర్స్ ఉన్నతాధికారులకు, ప్రభుత్వ పెద్దలకు విజ్ఞాపనలు చేస్తూ వచ్చారు. తాజాగా విజయవాడలోని అప్పీలేట్ అడిషనల్ కమిషనర్ కార్యాలయం పరిధిలోకి గుంటూరు 1, 2 డివిజన్‌లను చేర్చటంతో ఉమ్మడి జిల్లాలోని వ్యాపారులకు ప్రయాణభారం తప్పినట్లయింది.

కవయిత్రికి మొల్లకు ఘన నివాళి

గుంటూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కవయిత్రి మొల్ల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని గుంటూరు జిల్లా కుమ్మర శాలి వాహన సంఘం నాయకులు అన్నారు. గురువారం శ్రీరాంనగర్ మెయిన్‌రోడ్డులో కవయిత్రి మొల్ల జయంతిని సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ, రాష్ట్ర నాయకుడు రాజవరపు ఏడుకొండలు, పూర్ణచంద్రరరావు, సుబ్రహ్మణ్యం, దత్తు, సుబ్బారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో.. 16వ శతాబ్దంలో తెలుగు కవయిత్రిగా ఆతుకూరి మొల్ల ప్రసిద్ధిగాంచారని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్‌వో పెద్ది రోజా, టిడ్కో డైరెక్టర్ కానూరి నాగేశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ, డీటీసీ కరీం, బీసీ నేతలు పాల్గొన్నారు.

18 నుంచి ఒంటిపూట బడులు

గుంటూరు(విద్య),మార్చి14: జిల్లాలో అన్ని యాజమాన్యాలు పాఠశాలలకు ఈనెల 18 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు ఒంటి పూట బడులు నిర్వహించాలని డీఈవో పీ. శైలజ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించి తర్వాత మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. 1వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఎస్.ఏ-2 పరీక్షలు గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని సూచించారు. 10వ తరగతి పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో అన్ని తరగతుల విద్యార్థులకు సెలవులు ప్రకటించాలని ఆదేశించారు. ఈ పాఠశాలలు 18 నుంచి 23 లోపు అందుబాబులో వున్న సెలవు దినాల్లో తరగతులు నిర్వహించాలని సూచించారు.



చెక్కును మహిళలకు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

మహిళా సాధికారతే ఈబీసీ నేస్తం లక్ష్యం

● కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ● లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ

గుంటూరు సిటీ, మార్చి 14 : మహిళలు సాధికారిత సాధించే లక్ష్యంతో, ఆర్థికంగా బలోపేతం చేసేటటువంటి ఉద్దేశంతో ప్రారంభించిన కార్యక్రమం ఈబీసి నేస్తం పథకం అని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం ముఖ్యమంత్రి ఈబీసీ నేస్తం నగదును నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి బటన్ నొక్కి నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఆ కార్యక్రమ ప్రత్యక్షప్రసారాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే గిరిధర్ వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లతో కలసి వీక్షించారు. అనంతరం కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 21,687 మంది లబ్ధిదారులకు రూ. 32,53,05,000 లబ్ధి చేకూరుతుందన్నారు. అనంతరం నగదు నమూనా చెక్కును లబ్దిదారులకు అందించారు. కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బ్లాక్ స్పాట్‌లు గుర్తించాలి .. కలెక్టర్

జిల్లాలో రహదారులపై ప్రమాదాలు జరగకుండా బ్లాక్‌స్పాట్ లను గుర్తించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అవసరమైన భద్రత చర్యలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు.

కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన కూడళ్ళలో ట్రాఫిక్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేసేలా పోలీస్, మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సుదీక్షణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్13న జరగనున్న ఉచితంగా కృత్రిమ కాళ్ళు పంపిణీ శిబిరం ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె వెంకట రామిరెడ్డి, జీఎంసీ ఎస్ఈ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న బోనబోయిన, గాదె తదితరులు

జనసేన కూటమితో ప్రజా ప్రభుత్వం ఏర్పాటు

గుంటూరు, మార్చి 14: రాష్ట్రంలో అతి త్వరలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమితో కూడిన నూతన ప్రజా ప్రభుత్వం ఏర్పడం ఖాయమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం లాడ్జి కూడలిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత జనసేన పార్టీ నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను బోనబోయిన, గాదె కట్ చేశారు. పార్టీ జెండాను గాదె వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. కాగా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో మార్చి 17న చిలకలూరిపేటలో జరిగే భారీ బహిరంగ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని బోనబోయిన, గాదె కోరారు. కార్యక్రమంలో జనసేన వడ్రాణం మార్కాండేయబాబు, విజయ్ శేఖర్, నేరెళ్ల సురేష్, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీనా.. వైసీపీఎస్సీనా ?

గుంటూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం వున్నది ఏపీపీఎస్సీనా లేక వైసీపీఎస్సీనా అంటూ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ నిలదీశారు. 2018 గ్రూప్-1 మెయిన్స్ డిజటల్ మూల్యాంకనంపై హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో గుంటూరు కలెక్టరేట్ వద్ద గురువారం తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్ వినూత్న కార్యక్రమం నిర్వహించింది. తట్టలో గ్రూప్స్ ఉద్యోగాలు పెట్టుకుని వెళ్లి వాటిని అమ్ముకుంటూ ప్రభుత్వ తీరును వారు ఎండగట్టారు. ఈ సందర్భంగా సాయి కృష్ణ మాట్లాడుతూ ఏపీపీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 169 గ్రూప్- 1 పోస్టులను ప్రభుత్వం అమ్ముకుందని, ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. మన్నవ వంశీకృష్ణ మాట్లాడుతూ ఏపీపీఎస్సీలో 150 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు.

ట్యాంకర్ల తోనైనా నీటి సరఫరా చేయాలి

● ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు

కాకుమాను, మార్చి 14: నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల సాయంతోనైన నీటి సరఫరా చేయాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉందని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కాకుమాను ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి చెరువులు ఎండిపోయాయని మరో పదిహేను రోజుల పాటు తాగునీరు వచ్చే అవకాశం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మేజర్ పంచాయతీలు అయిన కాకుమాను, గరికపాడు, వంటి గ్రామాల్లో నీటి ఎద్దడి ఉందని స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సాగు నీరు కోసం రూ.10 నుంచి 25 వరకు చెల్లించాల్సి వస్తుందని పేదల పరిస్థితి ఏంటని వారు వాపోయారు. స్పందించిన ఎంపీపీ మాట్లాడుతూ నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో యుద్ధ ప్రతిపాదికన నీరు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రమేష్‌కు సూచించారు. కార్యక్రమంలో ఉప ఎంపీపీలు వెంకటరెడ్డి, కపిల్, ఎంపీడీవో రామకృష్ణ, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా సువర్ణరాజు

మంగళగిరి, మార్చి 14: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మంగళగిరికి చెందిన పులి సువర్ణరాజు నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలోని ఏపీసీసీ కార్యాలయంలో గురువారం ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులందరినీ చైతన్యవంతం చేసి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని సువర్ణరాజు తెలిపారు.

15, 16 తేదీల్లో కేఎల్‌యూలో మహిళా దినోత్సవం

తాడేపల్లి, మార్చి 14: కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రతి ఏడాది నిర్వహించే మహిళా దినోత్సవాన్ని వర్సిటీ ప్రాంగణంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు వీసీ సారధి వర్మ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఉమెన్ డెవలప్‌మెంట్ సభ్యులతో కలిసి వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయా కళాశాలలో చదివే బాలికలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఫెమ్ ప్లేయర్ ఛైర్‌పర్సన్ రూత్‌రమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వీసీ సారధివర్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ఆరంభం

● ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ



సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అనురాధ

మంగళగిరి సిటీ, మార్చి 14: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ఆరంభమైందని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. పట్టణంలోని రత్నాలచెరువు ప్రాంతంలో గురువారం ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్, కలలకు రెక్కలు పథకాలను వివరించి ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. చేనేత కుటుంబానికి చెందిన కందికుంట యశోదాదేవికి కదిరి టీడీపీ టిక్కెట్ కేటాయించడంపై చేనేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ అడ్డగోలు నిబంధనలతో ప్రభుత్వం పేదలకు సంక్షేమ ఫలాలు అందకుండా అడ్డుకుంటుందని వాపోయారు. రత్నాల చెరువులోని వలంటీర్లు సంక్షేమ పథకాలకు ఒక్కొక్కరి వద్ద రూ.200 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేశారని తెలిపారు. ఎమ్మెల్సీ అనురాధ మాట్లాడుతూ మంగళగిరిలో కరకట్ట కమల్‌హాసన్ నటించడం తప్ప నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. మహిళల సాధికారత కోసం ఏర్పాటు చేసిన పొదుపు సంఘాల డబ్బును కూడా సొంత పార్టీ ప్రయోజనాలకు జగన్ వాడుకున్నారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో పేదల ఇళ్లను క్రమబద్ధీకరించడంతో పాటు ఇళ్లులేని పేదలకు 20వేల ఇళ్లను నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాండ్రు శ్రీనివాసరావు, నేతలు గోవాడ దుర్గారావు, వింజమూరి ఆషాబాల, కారంపూడి అంకమ్మరావు, పడవల మహేష్, ఆరుద్ర భూలక్ష్మి, వంగర రమేష్, మద్దెమడుగు పాండురంగా, చిలకా బసవమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు టిఫిన్ బండ్లు పంపిణీ



చిరువ్యాపారులకు టిఫిన్ బండ్లు అందజేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, మార్చి 14: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో మంగళగిరి పట్టణానికి చెందిన ఆరుగురు చిరు వ్యాపారులకు గురువారం టిఫిన్ బండ్లు పంపిణీ చేశారు. తాడిపర్తి వెం కట నాగలక్ష్మి, షేక్ నవాబ్ జానీ, బొడ్డు వెంకట నాగశివసాయి, మల్లారి శ్రీనివాసరావు, జింకా శివకుమారి, మల్లెల నారీమణి సుందరిలకు గురువారం మంగళగిరి టీడీపీ కార్యా లయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో టిఫిన్ బండ్లు అందజేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గా రావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు కాండ్రు శ్రీనివాసరావు, వింజమూరి ఆషాబాల, మహమ్మద్ ఇబ్రహీం, వాకా మాధవరావు, షేక్ సుభానీ, ఆరుద్ర భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



కేకు కట్ చేస్తున్న జనసేన ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి, మార్చి 14: జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళగిరి పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఎగురవేసి కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా చిల్లపల్లి మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడుకునేందుకే జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయని చెప్పారు. ఓర్పు, క్రమశిక్షణ, నిజాయితీతో పాటు ఉన్నత వ్యక్తిత్వం కలిగిన పవన్‌కల్యాణ్ సారధ్యంలో పనిచేయడం ఎంతోగర్వంగా ఉందన్నారు. జనసైనికులు, వీరమహిళలు ఏకమై జగన్ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదనందిపాడు మండలంలో..

పెదనందిపాడు, మార్చి 14: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఏటీ పాలెంలో గ్రామపార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించి, పార్టీ జెండాను నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆముదాలపల్లి నరేంద్ర, షేక్ ఖాజా, గోపీ, శివరామకృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆమరణ దీక్షకు సిద్ధం

● స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్



దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, మార్చి 14: స్వర్ణకారుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణకారులు ఆమరణ దీక్షలకు దిగుతారని ఏపీ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ హెచ్చరించారు. స్వర్ణకార సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళగిరి షరాబ్ బజారులో జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్ చేస్తున్న నిరాహార దీక్షకు గురువారం ఆయన సంఘీభావం తెలిపారు. సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే రాబోయే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. సాయంత్రం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు దీక్షా శిబిరాన్ని సందర్శించి, నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. చిల్లపల్లి మాట్లాడుతూ స్వర్ణకారుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. రాబోయే ఎన్నికల తరువాత ఉమ్మడి కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ప్రజాప్రభుత్వంలో స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు కోసం కృషి చేస్తామని తెలిపారు. జనసేన మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సుభానీ, స్వర్ణకార సంఘం నేతలు దమర్‌సింగ్ ప్రకాష్, చిప్పాడ చందు, జొన్నాదుల చలపతిరావు, మండ్రు రాము, బల్లా రమణ, పాతమంగళగిరి పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు వూట్ల పాలశ్రీనివాసరావు, మండ్రు సత్యనారాయణ, దామర్ల నారాయణ, బట్టు నారాయణరావు, కాటాబత్తుల రాంబాబు, దామర్ల మోహన్, వింజమూరి వాసు, కె.ధనుంజయరావు, తదితరులు దీక్షలకు సంఘీభావం తెలిపారు.

లోకేశ్ సహకారంతో 90 మందికి కుట్టుమిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఆషాబాల, భూలక్ష్మి తదితరులు

మంగళగిరి సిటీ, మార్చి 14: నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో అమలు చేస్తున్న స్త్రీశక్తి కార్యక్రమంలో భాగంగా 55వ బ్యాచ్‌లో మంగళగిరి పట్టణం, మండలానికి చెందిన 90 మంది మహిళలు కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరికి మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో గురువారం లోకేశ్ సహకారంతో ఉచితంగా కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. తమ జీవనోపాధికి సహకరించిన లోకేశ్ మహిళలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి వింజమూరి ఆషాబాల మాట్లాడుతూ మంగళగిరిలో నారా లోకేశ్ వేలాది మంది మహిళలకు ఉపాధి రంగాల్లో శిక్షణ ఇచ్చి వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు ఊట్ల దుర్గామల్లేశ్వరి, మహిళా నేతలు మంచికలపూడి వైష్ణవి, గడ్డిపాటి అపర్ణ, వాసా పద్మ, యలమంచిలి పద్మజ, ఉడతా లావణ్య దివి లక్ష్మీ, మోతుకూరి సుజాత, గడ్డిపాటి తులసీ, యెద్లూరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా : సీఐ బాషా



గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న సీఐ సుభాని, సిబ్బంది

కాకుమాను, మార్చి 14: నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని ప్రత్తిపాడు సీఐ నిస్సార్ భాషా అన్నారు. మండల పరిధిలోని కొండపాటూరు, గరికపాడు, టీకేపాలెం గ్రామాల్లో గురువారం సీఐ ఎస్ఎఫ్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో కాకుమాను ఎస్ఐ రవీంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





చిన్నారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

గీతాంజలి కుటుంబ సభ్యులకు ప్రభుత్వసాయం అందజేత

తెనాలి రూరల్, మార్చి 14: ఇటీవల రైలు ప్రమాదంలో మృతిచెందిన తెనాలికి చెందిన గీతాంజలి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శివకుమార్ ప్రభుత్వం తరుపున ఆర్థికసాయం అందించారు. గురువారం గీతాంజలి ఇంటికి వెళిన ఎమ్మెల్యే శివకుమార్ ఆమె భర్త, కుమార్తెలను పరామర్శించారు. ప్రభుత్వం తరుపున ప్రకటించిన రూ.20లక్షల చెక్కులలో ఇద్దరు కుమార్తెలకు ఒక్కొక్కరికి రూ.10లక్షల వంతున చెక్కులను అందజేశారు. పార్టీ తరుపున అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జనసైనికులే పార్టీకి కొండంత బలం

● పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, మార్చి 14: జనసేన పార్టీకి జనసైనికులే కొండంత బలమని ఆ పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి మనోహర్ జెండాను ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రలో జరుగుతున్న అరాచకపాలనపై ప్రజల తరుపున పోరాడేందుకు ఉద్భవించిన పార్టీ జనసేన అన్నారు. జనసేన పార్టీ ఆశయాలు సిద్ధాంతాలు ప్రజలకు మేలు జరిగేవన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడిగా ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్నాయని అధికారమదంతో తలకెక్కిన జగన్ ప్రభుత్వాన్ని తరమికొట్టి ప్రజాసంక్షేమానికై పాటుబడే ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు జనసైనికులు, వీరమహిలలు తదితరులు పాల్గొన్నారు.



జనసేన జెండాను ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న మనోహర్, తదితరులు

కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌లు

తెనాలి, మారీసుపేట మార్చి 14: పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకులు మాదల కోటేశ్వరావు తెలిపారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ నాయకులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సౌజన్యంతో స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో, శివాజిచౌక్‌లోని అన్న క్యాంటీన్‌లలో గురువారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, క్రొత్తపల్లి రమేష్, ముళ్ళపూడి వెంకట్, వెల్లంకి సాంబయ్య, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, సంజయ్, కామేశ్వరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



సోమసుందపాలెంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ పార్లమెంటరీ నాయకుడు చంద్రశేఖర్, పక్కన పార్టీ శ్రేణులు

మంచి చేయాలన్న ఆశయంతో నడుస్తున్నా..!

● టీడీపీ పార్లమెంటరీ నాయకుడు పెమ్మసాని

తెనాలి రూరల్, మార్చి 14: కుటుంబంలో ఒకడిగా ఉంటూ గ్రామస్థులందరికీ మంచి చేయాలన్న ఆశయంతో మీ ముందుకు వచ్చానని గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతోనే పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటుచేసి ప్రారంభించడం జరిగిందని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నాయకుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. గురువారం మండలంలోని సోమసుందరపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగుదేశం, జనసేన ఉమ్మడి పార్టీ కార్యాలయాన్ని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కేసన కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు, జనసేన, బీజేపీ పార్టీల శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ శ్రేణులు

పంట ఉత్పత్తులను భద్రతకే గోడౌన్‌ల నిర్మాణం

● ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్, మార్చి 14: వ్యవసాయ గ్రామాలైన తెనాలి మండలంలోని రైతులు పండించిన పంట ఉత్పత్తులను భద్రపరుచుకునేందుకు అవసరమైన గోడౌన్‌లను నిర్మించేందుకు భూమిపూజ చేయడం జరిగిందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. గురువారం మండలంలోని నందివెలుగులో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో రైతులకు ఉపయోగపడేలా నూతనంగా నిర్మించతలపెట్టిన 1000 మెట్రిక్ టన్నుల గోడౌన్‌ను ఎమ్మెల్యే శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన, భూమిపూజ చేసి శిలాఫలకాన్ని విష్కరించారు. కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకునేందుకు కలసిరండి.. కదలిరండి..!

● ఎన్నికల ప్రచారయాత్రలో పెమ్మసాని, నాదెండ్ల





గజమాలతో పెమ్మసాని, నాదెండ్లకు స్వాగతం పలుకుతున్న గణేష్‌యూత్ మురళి, నాగభూషణం, గ్రామంలోకి ర్యాలీగా తీసుకువెళ్తున్న మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు

తెనాలి రూరల్, మార్చి 14: అమరావతి రాజధానిగా ఆంధ్ర రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకునేందుకు తెలుగుదేశం, జనసేన, బీజేపీతో ప్రజలందరూ కలసిరావాలని కదలిరావాలని టీడీపీ గుంటూరు పార్లమెంటరీ నాయకుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం తెనాలి నియోజవర్గంలో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌లు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత సోమసుందపాలెంలో పర్యటించి గ్రామంలో పార్టీ కార్యాలయాన్ని ఎంపీ అభ్యర్థి పెమ్మసాని ప్రారంభించారు. గ్రామస్థులకు పార్టీ ఎన్నికల మినీమేనిఫెస్టోను ప్రచారం చేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెనాలిలోని తెనాలిలో 4,5 వార్డులో పర్యటించారు. రోడ్‌షోగా తెనాలి మండలం అంగలకుదరు, కోపల్లె గ్రామాల్లో పర్యటించారు. దారిపొడవునా పార్టీ శ్రేణులు, అభిమానులు వారికి ఘన స్వాగతం పలికారు. తెనాలిలో దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ రాజ్యసభ సభ్యుడు దివంగత యడ్లపాటి వెంకట్రావు స్వగృహానికి చేరుకుని ఆయన విగ్రహానికి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌లు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎన్నికల ప్రచారంగా వస్తున్న నేతలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందని విమర్శించారు. రాష్ట్రంలో ఎంతో మేధాశక్తి ఉన్న విద్యార్థులున్నారని ఉన్నత చదువులు ముగిసిన తరువాత రాష్ట్రం విడిచి ఉద్యోగాలకు వెళ్లవలసి వచ్చిందన్నారు. సొంత ఊరి, సొంత మనుషులను విడిచి యువత వెళ్లడం కుటుంబ సభ్యులకు బాధ కలిగిస్తుందన్నారు. తాము ఎన్నికల అనంతరం ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన వెంటనే రాష్ట్రంలో అవసరమైన పరిశ్రమలు, కంపెనీలు తీసుకువచ్చి మన ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అంతేకాకుండా వ్యవసాయ ప్రాంతమైన మన ప్రాంతంలో సాగునీరుకు లోటులేకుండా రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు. అందరి ఆకలి తీర్చే అన్నదాత బాగుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. గ్రామాల్లో అన్నిరకాల మౌలిక వసతులు కల్పించడంతోపాటు వారందరికి భరోసాగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థిగా పోటీచేసే అభ్యర్థికి సైకిల్ గుర్తు, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసే నాదెండ్ల మనోహర్‌కు గాజు గ్లాసు గుర్తులపై ఓటు వేసి ఘన విజయం సాధించేలా చూడాలని కోరారు.



భారీర్యాలీగా తరలివస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్

మనోహర్ మాట్లాడుతూ పట్టణ, గ్రామాల్లో వైసీపీపాలన ప్రారంభమైన తరువాత కనీస వసతులు కూడా కరువయ్యాయన్నారు. తాము అధికారం చేపట్టిన వెంటనే నియోజవర్గంలోని పట్టణ, మండల గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలన్నింటిని పరిశీలించి వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. అభివృద్ధి సంక్షేమానికి మారుపేరుగా ఉన్న ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పెద్దసంఖ్యలో పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

అంగలకుదురులో ఘనస్వాగతం

తెనాలి రూరల్, మార్చి 14: ఎన్నికల ప్రచారంలో భాగంగా తెనాలి నియోజవర్గంలో పర్యటిస్తున్న గుంటూరు పార్లమెంటరీ నాయకులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్లమనోహర్‌కు అంగలకుదురులో ఘనస్వాగతం లభించింది. గ్రామ పార్టీ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరయ్యారు. అంగలకుదురు గ్రామ ప్రారంభంలో గణేష్ యూత్ కన్వీనర్ టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి, గ్రామ ఉప సర్పంచ్ కనగాల నాగభూషణంల ఆధ్వర్యంలో వారిని గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గణేష్ యూత్ ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పెమ్మసాని, మనోహర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, హెచ్‌సీపీ అధినేత కరణం వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాస్, గ్రామ ప్రెసిడెంట్ ఊసరపు రాజ్యలక్ష్మి గ్రామ పార్టీ నాయకులు గ్రామంలోకి ఘన వారిని ర్యాలీగా ఘన స్వాగతం పలికారు. గ్రామ పార్టీ శ్రేణులును ఇరువురికి పరిచయం చేసిన అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో పెమ్మసాని, నాదెండ్ల మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా ఉంటూ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. తామకు నాయకులు, కార్యకర్తలని భేదం లేదని ఎవ్వరైనా ఎప్పుడైనా తమను సంప్రదించవచ్చన్నారు. అందరం కలిసికట్టుగా ఐకమత్యంతో ముందుకు సాగుతూ వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామన్నారు. కార్యక్రమంలో అన్నాబత్తుని జయలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరరావు, పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన: పెమ్మసాని

కొల్లిపర, మార్చి 14 : రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుటంతో పాటు కులాల కుమ్పటీ నడుస్తోందని ఇటువంటి పాలనకు చరమగీతం పాడాలని గుంటూరు పార్లమెంట్ టీడీపీ నాయకుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. గురువారం మండల కేంద్రం కొల్లిపర పాల ఉత్పత్తిదారుల కల్యాణ మండపంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ టీడీపీ ఎక్కువ రోజులు పాలన కొనసాగిందని ఆపాలనలో ఆరాచకాలు, ఇటువంటి కులాల కుంపటి లేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన గంజాయి కనిపిస్తోందని గుంటూరుకు సంబంధించిన ఎమ్మెల్యే రాష్ట్రవ్యాప్తంగా గంజాయిని సరపరా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమాజంలో ఉన్న యువత మత్తుతో మునిగి ఏమి చేస్తున్నారో అర్థంగాని పరిస్థితిలో ఉన్నారన్నారు. కృష్ణానదిలో ఇసుక ఎక్కువలోతులో పెట్టి తవ్వకాలు జరిపి భారీ వాహనాల ద్వారా తరలిస్తున్నారని దీంతో రోడ్లుకూడా గుంతలమయింగా మారినట్లు తెలిపారు. తెనాలి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గతంలో తాను శాసన సభ్యుడిగా పని చేసినప్పుడు తెనాలి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపేనన్నారు. అంతేకాకుండా అనాడు తాగునీటి కొరత తీర్చేందుకు కోట్లాది రూపాయలతో రక్షిత తాగునీటి పథకాన్ని తీసుకువచ్చి పైపులైన్లు ద్వారా నియోజకవర్గ ప్రజలకు అందించామన్నారు. అట్టడుగు స్థాయిలో ఉండి మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు వేసి రూపరేఖలు మార్చినట్లు తెలిపారు. మరలా అరాచపాలన నుంచి విముక్తి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్న అభ్యర్థులను రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. అంతే కాకుండా చంద్రశేఖర్ సేవ చేయాలనే తలంపుతో రాజకీయాల్లోకి వచ్చారని అటువంటి వ్యక్తులను మంచి మెజార్టీతో గెలిపించాలన్నారు.

నియోజకవర్గంలో ఉన్న అన్ని గ్రామాలు తిరిగి ప్రజాసమస్యలను తెలుసుకుంటున్నానని ఆ సమస్యలను అన్ని ంటిని తీర్చేందుకు నెలరోజుల వ్యవధిలో ప్రభుత్వం మారిబోతుందని మన ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గాన్ని రూపరేఖలు మార్చనున్నట్లు తెలిపారు. తొలుత నందివెలుగు నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తూ పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్ కార్యకర్తలతో సభావేదిక వద్దకు చేరుకున్నారు. నాయకులు , కార్యకర్తలు ఘనస్వాగతం పలికి గజమాలతో ఇరువురు నాయకులను సత్కరించారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ప్రదర్శన చేస్తున్నసీఐటీయూ కార్యకర్తలు

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి

● సీఐటీయూ జిల్లా నాయకులు బాబుప్రసాద్

తెనాలి అర్బన్, మార్చి 14: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం మార్కెట్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, రుణమాఫీ అమలు చేయాలని కోరారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరుగుతున్న బహిరంగ సభకు మద్దతుగా పట్టణంలో ప్రదర్శన చేస్తామన్నారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, కర్షక విధానాలు విడనాడకుంటే రానున్న ఎన్నికల్లో మూల్యం తప్పదన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని అవి ఏర్పాటుచేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. షేక్ హుస్సేన్‌వలి, మంగళగిరి వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, సుభద్ర, సుహాసిని, సాంబశివరావు పాల్గొన్నారు.



వధువుకు పెండ్లి కానుకను అందిస్తున్న పార్టీ నాయకులు

ఆలపాటి పెండ్లికానుక అందజేత

తెనాలి రూరల్, మార్చి 14: కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామంలో కుంభంపాటి శ్రీనివాసరరావు, గోవర్ధన దంపతుల కుమార్తె సింధూర వివాహాన్ని పురస్కరించుకుని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పంపిన ఆలపాటి పెండ్లికానుకగా మంగళసూత్రం నూతన వస్త్రాలను పార్టీ నాయకులు అందించి ఆశీర్వదించారు. పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పొన్నూరు టౌన్, మార్చి 14: పట్టణంలో ఏడుగురు జూదర్లును అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ పి.భాస్కర్ తెలిపారు. గురువారం తెల్లవారుజామున మూడోవ వార్డులో కోతముక్క జూదం నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడి చేయగా ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 14,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భాస్కర్ తెలిపారు.

నిడుబ్రోలు సొసైటీ అధ్యక్షుడిగా రావిపాటి మురళి

పొన్నూరు టౌన్, మార్చి 14: నిడుబ్రోలు పీఏసీఎస్ అధ్యక్షుడిగా రావిపాటి మురళి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే పాలకవర్గ సభ్యులుగా కొండమూడి కమలాకర్, షేక్ సైదాలు నియమితులై ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రావిపాటి మురళిని నిడుబ్రోలు వాసులు, వైసీపీ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.

అంబటి వ్యాఖ్యలు హాస్యాస్పదం: రామరాజు

చేబ్రోలు, మార్చి14: పొన్నూరుకు దిగుమతి అయ్యి వచ్చిన అంబటి మురళీ కృష్ణ తమ నాయకుడు ధూళిపాళ్ళ నరంద్ర కుమార్‌పై చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్ని చేబ్రోలు మండల టీడీపీ అధ్యక్షుడు షైలా రామరాజు అన్నారు. గురువారం వడ్లమూడిలో జరిగిన విలేకర్ల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ స్వగ్రామం అని చెపుకుంటునే మామిళ్లపల్లి గ్రామానికి అంబటి ఏం చేశాడో చెప్పాలన్నాడు. పొన్నూరుపై అంబటి మురళీది కపట ప్రేమ అన్నారు. రాజకీయల లబ్ధి కోసం అంబటి మురళి చేస్తున్న వ్యాఖ్యలు సరికాదన్నారు. ధూళిపాళ్ళ కుటుంబంపై మాట్లాడే అర్హత అంబటికి లేదన్నారు. వైసీపీ హయాంలో జరిగిన గ్రావెల్ అక్రమాలపై శాటిలైట్ ఎంక్వరీకి తాము సిద్ధమేనన్ని ప్రకటించారు. సమావేశంలో అనంత లక్ష్మీ నారాయణ, వీరంకి రంగారావు, కట్టా రవీంద్ర, గట్టుపల్లి వెంకటేశ్వరరావు, అద్దంకి రాము, కె చంద్రకాంత్ తదితర టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ శారదకు షారోన్ అంతర్జాతీయ అవార్డు

తెనాలి అర్బన్, మార్చి 14: వైద్యరంగంలో మూడు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న డాక్టర్ శారదకు షారోన్ అంతర్జాతీయ అవార్డు ప్రదానం చేస్తామని సినీ దర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. పెన్నీ మినిస్ట్రీస్ సేవా సంస్థకు జీవితకాలం సేవలు అందిస్తున్న కెనడాకు చెందిన షారోన్ అకాల మృతి చెందారని ఆమె పేరుతో ప్రతి ఏటా అవార్డు అందిస్తున్నామన్నారు. వచ్చే ఏడాది అవార్డును జమైకా దేశంలోని భారత వైద్యుడు నాగమల్లేశ్వరరావుకు అందిస్తారని పెన్నీ మినిస్ట్రీస్ అంతర్జాతీయ సంస్థ ప్రకటించిందన్నారు. సుల్తానాబాద్‌లోని కళ్యాణ మండపంలో శనివారం జరిగే అవార్డు ఉత్సవానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి కృషి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట మార్చి 14: పట్టణంలో డ్రెయినేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారాని కృషి చేస్తానని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో గురువారం శానిటేషన్ పనులను పర్యవేక్షించి మున్సిపల్ అధికారులకు, కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ సుందరీకరణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు, మున్సిపల్ అధికారులు, గ్రీనరీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

మేడికొండూరు, మార్చి 14: మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన మన్నవ సూర్య ఆదిత్య అనే బాలుడు గురువారం ఉదయం నుంచి కనిపించడం లేదని బాలుడి తల్లి వాసంతి ఇదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సూర్య ఆదిత్య నల్లపాడులోని లయోలా స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. ఉదయం 8:30 గంటల సమయంలో సిరిపురం నుంచి లయోలా స్కూలుకు వద్దకు వెళ్లిన తర్వాత స్కూల్ గేటు బయట దిగి అక్కడ నుంచి కనిపించలేదు.



తెలుగుదేశం పార్టీలో చేరిన చేబ్రోలు వైసీపీ నాయకులు

వైసీపీ విధ్వంస పాలనపై విస్తృత్త ప్రచారం

● మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ

చేబ్రోలు, మార్చి14: వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో చేసిన విధ్వంస అరాచక పాలనపై విస్తృత ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని చింతలపూడి న,రేంద్ర కమార్ స్వగృహంలో గురువారం చేబ్రోలుకు చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. చేబ్రోలు చెరువులో పాలెంకు చెందిన వైసీపీ నాయకుడు నరేంద్రకుమార్ సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకొని చేరారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయంలో జరిగిన అరాచకాలపై వైసీపీ నాయకులు, కార్యకర్తలే విసుగుచెంది టీడీపీవైపు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితులను విద్యకు దూరం చేసిన జగన్: ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, మార్చి 14: పాఠశాలల విలీనం పేరుతో ఎస్టీ కాలనీలో పాఠశాలలో మూసివేసి దళితులను విద్యకు జగన్‌మోహన్ రెడ్డి దూరం చేశారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. గురువారం మండల పరిధిలోని చింతలపూడి ఎస్సీ కాలనీలో వైసీపీకి చెందిన పలు కుటుంబాలు నరేంద్ర కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి. చింతలపూడికి చెందిన చుండూరి మధుబాబు, బోనాసి వంశీ, భలభద్ర సుబ్బారావు, విజయ్ కిరణ్, శ్రీనివాస్, వరగాని రాజేష్, చావలి ఏసోబు, ఆరెమండ సురేష్, చుండూరి రమేష్, పుష్పరాజు, సురేష్, తదితరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో దళితులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. 27 సంక్షేమ పథకాలను నిలిపివేసి దళితుల సంక్షేమాని అడ్డుకున్నారిన్న ఆరోపించారు. రానున్న రోజులో టీడీపీ హయాంలో దళితులతోపాటు, అన్ని వర్గాలకు మేలే జరిగేలా నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు.

వీరయ్య మృతి టీడీపీకి తీరని లోటు: ధూళిపాళ్ళ



వడాలశెట్టి వీరయ్యకు నివాళి అర్పిస్తున్న నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, మార్చి 14: టీడీపీ సీనియర్ నాయకుడు వడాలశెట్టి వీరయ్య మృతి పార్టీకి తీరని లోటు అన్ని మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వడాలశెట్టి వీరయ్య బుధవారం మృతి చెందారు. అయన మృతి సమాచారం తెలుసుకున్న నరేంద్ర కుమార్ గురువారం కట్టెంపూడి గ్రామానికి వెళ్లి వీరయ్య మృతదేహాని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వీరయ్య కుమారుడు టీడీపీ మండల రైతు అధ్యక్షుడు వడాలశెట్టి శ్రీనివాసరావును పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీకి వీరయ్య కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని మననం చేసుకున్నారు. వీరయ్యకు నివాళులు అర్పించిన వారిలో మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబురావు, మున్నంగి సుబ్బారెడ్డి, యక్కటి పద్మారావు, యక్కటి రామారావు, వేంపాటి శంకర్, యక్కటి నాగేశ్వరరావు కారెడ్ల శ్రీనివాసరావు తదితరులు వీరయ్యకు నివాళులర్పించారు.

సిబార్ దంత వైద్య కళాశాలకు నాక్ ఏ గుర్తింపు

గుంటూరు, మార్చి 14: తక్కెళ్ళపాడులో ఉన్న సిబార్ దంత వైద్య కళాశాలకు నేషనల్ అస్సెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్‌ఏఏసీ) భారత ప్రభుత్వ సంస్థ నుంచి నాక్ ఏ గుర్తింపు లభించింది. మొదటి ప్రయత్నంలోనే న్యాక్ ఏ గుర్తింపు సాధించి దేశంలోనే అతికొద్ది దంత వైద్య కళాశాలల సరసన చేరటం గర్వించదగిన విషయమని కళాశాల యాజమాన్యం తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే న్యాక్ ఏ గుర్తింపు పొందిన తొలి కళాశాల కావటం నిజంగా హర్షించదగ్గ విషయమన్నారు. జనవరి నెలలో జరిగిన నాక్ తనిఖీల్లో నవీన పద్ధతుల్లో అత్యుత్తమ విద్యాబోధన, అధునాతన దంత వైద్య పద్ధతులు, దంత వైద్య పరిశోధనలు, సామాజిక దంత వైద్య శిబిరాల నిర్వహణ మొదలగు అంశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సిబార్ దంత వైద్య కళాశాల ఈ ఘనతను సాధించిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గుర్తింపుతో రాబోయే రోజుల్లో సిబార్ దంత వైద్య కళాశాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో కలిసి సంయుక్త పరిశోధనలు, దంత వైద్య విద్యలో నూతన ఒరవడులు మొదలగు అంశాలపై పనిచేసే అవకాశం లభిస్తుందని తెలిపారు.

వీవీఐటీలో చిప్ డిజైనింగ్‌పై సదస్సు

గుంటూరు, మార్చి 14: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో డిజైన్ సింథసిస్ అండ్ వపర్ ఎస్టిమేషన్ అంశంపై సదస్సు గురువారం జరిగింది. ముఖ్యవక్తగా అమెరికాకు చెందిన బ్రాడ్‌కామ్ సంస్థ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇంజనీర్ వంశీగోపాల్ వాసిరెడ్డి హాజరయ్యారు. వంశీగోపాల్ మాట్లాడుతూ చిప్‌ల తయారీ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని, స్మార్ట్ వెహికల్స్ ఎలక్ట్రికల్స్‌లో చిప్‌ల వినియోగం అధికంగా ఉందన్నారు. అధిక ఉష్ణోగ్రత కలిగిన ప్రాంతాల్లో చిప్‌ల పనితీరు ఏ విధంగా ఉంటుందో విద్యార్థులకు వివరించారు. ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన విద్యార్థులకు విదేశాల్లో చిప్‌డిజైనింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, వీఎల్ ఎస్ఐ డిజైన్ రంగాలలో మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏవీ నరేష్‌బాబు, విద్యార్థులు, అధ్యాపకులు ఉన్నారు.

టీడీపీ, జనసేన విజయమే లక్ష్యం: మాదాసు

పొన్నూరు టౌన్, మార్చి 14: రానున్న ఎన్నికలో టీడీపీ, జనసేన విజయమే లక్ష్యంగా పనిచేస్తామన్ని చిరంజీవి యువత జిల్లా కార్యదర్శి మాదాసు అప్పారావు అన్నారు. గురువారం మాదాసు ఆధ్వర్యంలో పలువురు యువకులు జనసే పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని చింతలపూడి గ్రామం నుంచి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, వంగవీటి మోహన రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం గుంటూరు తరళివెళ్లి జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, పొన్నూరు సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయ బాబు ఆధ్వర్యంలో మాదాసు అప్పారావు తదితరులు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీలో యువకులతో కలిసి చేరినట్లు చెప్పారు. రానున్న రోజులో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలోకి తీసుకువెళ్లి టీడీపీ, జనసేన గెలుపు కోసం పని చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.